
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
గుంటూరు జిల్లా వార్తలు
1
ఆదివారం 17 మార్చి 2024







షెడ్యూల్.. వచ్చేసింది

- ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్
- మే 13న పోలింగ్.. జూన్ 4న ఓట్ల లెక్కింపు
- ఈ సారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్ర జ్యోతి): గుంటూరు, పల్నాడు, బాపట్ల జిల్లావాసులు ఎదురు చూస్తున్న సార్వ త్రిక ఎన్నికల షెడ్యూల్ శనివారం విడు దలైంది. దేశ వ్యాప్తంగా ఏడు దశల్లో ఎన్నికలు జరగనుండగా ఆంధ్రప్రదేశ్‌లో నాల్గో దశలో ఎన్నికలు నిర్వహించ నున్నట్లు ఈసీ ప్రకటించింది. దీంతో ఎన్నికల ప్రచారానికి రాజకీయ పార్టీల కు తగినంత సమయం అందుబా టులోకి వచ్చినట్లైంది. షెడ్యూల్ శనివా రమే విడుదలైనప్పటికీ గుంటూరు, ప ల్నాడు, బాపట్ల జిల్లాల్లో ఎన్నికల నోటిఫికేషన్ ఏప్రిల్ 18న విడుదల కానుంది. అదే రోజు నుంచి నామి నేషన్లను



గుంటూరులో నేతల ఫ్లెక్సీలను తొలగిస్తున్న జీఎంసీ సిబ్బంది

స్వీకరిస్తారు. ఏప్రిల్ 25 వరకు నామినేషన్ల దాఖలు కు గడువు ఇచ్చారు. 26న నామినేషన్ల పరిశీలన, 29న నామినేషన్ల ఉపసంహరణకు గడువు ఉంటుంది. అదే రోజు ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు, వారికి కేటా యించిన గుర్తులను ప్రకటిస్తారు. మే 13న సోమ వారం పోలింగ్ జరుగుతుం ది. ఓట్ల లెక్కింపు జూన్ 4న నిర్వహి స్తారు. గత 2019 సార్వత్రిక ఎన్నికలతో పోల్చి చూస్తే అప్పట్లో మొదటి విడత లోనే ఇక్కడ ఎన్నికలు జరిగాయి. దాంతో పోలింగ్ జరిగిన తర్వాత ఓట్ల లెక్కింపు జరగడానికి 40 రోజులకు పైగా సమ యం పట్టింది. ఈ దఫా రాష్ట్రంలో పోలింగ్ మొదటి విడతలో వద్దని కొన్ని పార్టీలు హైకోర్టుని ఆశ్రయిం చాయి. వారి విజ్ఞప్తిని పరిశీలించాలని హైకోర్టు కేంద్ర ఎన్నికల సంఘానికి సూచిం చింది. కాగా ఈ దఫా నాల్గో విడతలో ఎన్నికలు జరగనుండటం, అలానే ఓట్ల లెక్కింపుని గతంతో పోల్చితే 11 రోజులు వెనక్కు జరిపింది. పండగలు, ఎండల తీవ్రత, పిల్లల పరీక్షలు వంటి వాటిని పరిగణనలోకి తీసుకుని ఈసీ ఈ నిర్ణ యాన్ని తీసుకున్నట్లు ప్రకటించింది. ఈసారి పోలింగ్ జరిగిన 22 రోజుల్లోనే ఫలితాలు వెలువడతాయి. గతంలో వలే తొలి విడతలోనే సార్వత్రిక ఎన్నిక లు జరగాలని వైసీపీ వర్గాలు ఎన్నో ఆశలు పెట్టుకుని ఎదురు చూశాయి. దాని వల్ల ఎన్నికల ఖర్చు తగ్గడంతో పాటు సెంటిమెంట్ వర్కు అవుతుంద ని భావించాయి. ప్రతి పక్షాలు మాత్రం చివరి విడతల్లో ఎన్ని కలు జరిగితే తమకు మేలని భావిం చాయి. అయితే ఎన్నికల సంఘం మధ్యే మార్గంగా నాల్గో విడత లో నిర్వహించడానికి నిర్ణయం తీసుకున్నది.

రెండున్నర నెలలకు పైగా కోడ్ అమలు

ఎన్నికల కోడ్ ఈ దఫా రెండున్నర నెలలకు పైగా అమలులో ఉండనుంది. ఈసీ ఎన్నికల షెడ్యూల్ ప్రకటనతో శనివారం మధ్యాహ్నం నుంచే కోడ్ అమలులోకి వచ్చేసింది. ఇది మొదలు జూన్ 4 ఓట్ల లెక్కింపు ముగిసే వరకు అమలులో ఉంటుంది. దీనిని పరిగణ నలోకి తీసుకుంటే దాదాపు 75 రోజుల పాటు కొత్తగా ఎలాంటి అభివృద్ధి పనుల ప్రారంభోత్సవాలు, శంకుస్థాప నలు చేయడానికి వీల్లేదు. కోడ్ అమలు లోకి వచ్చిన దృష్ట్యా ప్రభుత్వ ఆస్తుల పై, ఆవరణల్లో ఏ పార్టీకి సంబంధించిన పోస్టర్లు, జెండాలు, రంగులు న్నా వాటిని తొలగించాల్సిందే. ప్రభుత్వ కార్యాలయా లు, సమావేశ మందిరాల్లో ఉన్న ప్రధానమంత్రి, ముఖ్యమంత్రి ఫొటోలు తొలగించాలి. రాజకీయ పార్టీల నేతల విగ్రహాలకు ముసుగులు తొడగాలి.

ఆర్థిక సాయం విడుదలపై అభ్యంతరం

చేయూత, ఈబీసీ పథకాలకు సం బంధించి లబ్ధిదారులకు విడుదల చే యాల్సిన ఆర్థికసాయాన్ని ప్రభుత్వం జాప్యం చేస్తూ వస్తోన్నది. వాస్తవానికి వీటికి గత ఏడాదే ఆర్థికసాయం విడు దల చేయాలి. అలాంటిది ఎన్నికల కోసం వాయిదా వేస్తూ ఈ నెలలో



నేతల విగ్రహాలకు ముసుగులు తొడుగుతున్న జీఎంసీ సిబ్బంది

లాం ఛనంగా విడుదల చేశారు. చేయూత కింద ఒక్కో లబ్ధిదారుడికి రూ.18,750, ఈబీసీ నేస్తం కింద రూ.15 వేలు విడు దల చేయాలి.

అయితే సీఎం లాం ఛనంగా ప్రారంభించి రెండు వారాలు గడు స్తున్నా ఇప్పటివరకు చేయూతకు సంబంధించి కొందరి ఖాతాలకే నగదు జమైం ది. ఇప్పుడు ఎన్నికల కోడ్ అమ లులోకి వచ్చిన నేపథ్యంలో వాటిని నిలి పేయాలని ప్రతిపక్షాలు కోరుతున్నాయి.

రంజాన్ వేళలు
ఇఫ్తార్ (సాయంత్రం) 6.24(ఆదివారం)
సహోరీ (ఉదయం) 4.58 (సోమవారం)

ఛలో బొప్పూడి

- సభకు సర్వం సిద్ధం
- నేడే ప్రజాగళం బహిరంగ సభ
- తరలివస్తున్న అతిరథమహారథులు
- ఉరిమే ఉత్సాహంతో కూటమి శ్రేణులు
- చారిత్రాత్మక సభకు అసాధారణ ఏర్పాట్లు

చిలకలూరిపేట, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): టీడీపీ-జనసేన-బీజేపీ పొత్తు అనంతరం.. ఎన్నికల షెడ్యూల్ విడుదల తర్వాత.. ప్రధాని నరేంద్రమోదీ, టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కల్యాణ్‌లు ఒకే వేదికపై తొలిసారి ఎన్నికల శంఖా రావం పూరించనున్నారు. ఇందుకు చిలకలూరిపేట మండలం బొప్పూడి వేదికగా మారింది. ఆదివారం బొప్పూడి వద్ద ఉమ్మడిగా జరిగే భారీ బహిరంగ సభకు సర్వం సిద్ధం చేశారు. రాష్ట్ర చరిత్రలో నిలిచి పోయేలా కూటమి నేతృత్వంలో నిర్వహిస్తున్న ఈ భారీ బహిరంగ సభకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యా యి. జాతీయ రహదారి అనుకుని ఉన్న 300 ఎక రాల సువిశాల మైదానంలో అసాధారణరీతిలో ఏర్పాట్లు చేశారు. ప్రజాగళం పేరుతో నిర్వహించే ఈ భారీ బహిరంగ సభలో జనం వారి గొంతుకను వినిపించేందుకు సిద్ధమయ్యారు. కూటమి అధినేత లు ముగ్గురూ సభకు హాజరు కానుండటంతో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణుల్లో జోష్ నెలకొంది. అంచనాలకు మించి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ప్రజలు హాజరవుతారని నేతలు భావిస్తున్నారు. సుమారు 10 లక్షల మందికి పైగా ప్రజలు హాజరవుతారని కూటమి నేతలు అంచనా వేస్తున్నారు. సభ ఘన విజయానికి కూటమి నేతలు కసరత్తు పూర్తి చేశారు. టీడీపీ, జనసేన, బీజేపీ సీనియర్ నాయకులు పది మంది చొప్పున వేదికపైకి అనుమతి ఇ స్తున్నట్లు నేతలు తెలిపారు. సభా ప్రాంగణం లో త్రిమూర్తుల (మోదీ, చంద్రబాబు, పవన్) ప్రసంగాలను వీక్షించేందుకు 20 భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు ఏర్పాటు చేశారు. మోదీ, చంద్రబాబు, పవ న్‌కల్యాణ్ పాల్గొనే ఉమ్మడి సభ కావడంతో ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చే అవకాశం ఉందని నేత లు ఆశిస్తున్నారు. పల్నాడు, గుంటూరు, బాపట్ల, ఉమ్మడి కృష్ణ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల నుంచి లక్షల సంఖ్యలో ప్రజలు తరలివచ్చేందుకు అవసర మైన ఏర్పాట్లు చేశారు. ఆర్టీసీ బస్సులతో పాటు విద్యా సంస్థల బస్సులను జనాన్ని తరలించేందుకు ఎక్కడికక్కడ నేతలు సిద్ధం చేసుకున్నారు. ఇక కార్లు, జీపులు, ఆటోలను సమకూర్చారు. జనసమీక రణకు పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలపై నేత లు ప్రత్యేక దృష్టి సారించారు. ఆయా జిల్లాల నుం చి వేలాది ద్విచక్ర వాహనాలపై కూడా అభిమాను లు, కార్యకర్తలు, ప్రజలు సభకు తరలిరానున్నారు. చిలకలూరిపేట, ఒంగోలు మార్గంలో జాతీయ రహ దారి వెంట మోదీ, చంద్రబాబు, పవన్‌కల్యాణ్ లతో కూడిన ఫ్లెక్సీలను భారీగా ఏర్పాటు చేశారు. సభ పూర్తయ్యేసరికి చీకటి పడే అవకాశం ఉండటంతో సభా ప్రాంగణం, పార్కింగ్ స్థలాల వద్ద పెద్దపెద్ద ఫ్లడ్‌లైట్లను ఏర్పాటు చేశారు.

ప్రాంగణాన్ని జల్లెడ పట్టిన బాంబ్ స్క్వాడ్

ప్రధాని నరేంద్రమోదీ సభకు హాజరు కానుండ టంతో ఎస్పీజీ బృందం ప్రత్యేక నిఘా ఉంచింది. వేదిక, ఆ పరిసరాలను శనివారం సాయంత్రం నుం చి స్వాధీనం చేసుకుంది. ప్రాంగణం మొత్తం బాంబ్ స్క్వాడ్, జాగిలాలతో విస్తృత తనిఖీలు నిర్వ హించారు.

ప్రత్యేక ఆసక్తి..

ఎన్నికల షెడ్యూలు విడుదలైన నేపథ్యంలో తొలిసారి జరుగుతున్న సభ కావడం.. అతిరథమహారథులు తరలిరానుండటంపై రాష్ట్ర ప్రజా నీకం ప్రత్యేక ఆసక్తి కనబరుస్తోంది. మూడు పార్టీల పొత్తు తర్వాత నిర్వహిస్తున్న తొలి సభ కావడంతో జాతీయ మీడియా కూడా ప్రత్యేక దృష్టి సారించింది. ఇప్పటికే ఢిల్లీ నుంచి జాతీయ మీడియా ప్రతినిధులు గుంటూరుకు చేరుకున్నారు. రాష్ట్ర భవిష్యత్ కు దశ-దిశ నిర్దేశించనున్న సభగా ఏపీ ప్రజలు భావిస్తున్నారు. జగన్ పాలనలో విధ్వంసానికి గురైన రాష్ట్ర పునర్నిర్మాణానికి మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ రూట్ మ్యాప్ ప్రకటించే అవకాశం ఉందని విశ్లేషకులు చెబుతున్నారు. సభ మధ్యా హ్నం మూడు గంటలకు ప్రారంభం కానుంది. వేర్వేరు హెలికాప్టర్లలో మోదీ, చంద్రబాబు, పవన్ కల్యాణ్ సభా ప్రాంగణానికి చేరుకు నేలా ఏర్పాట్లు జరిగాయి.

శనివారం ఉదయం నుంచే హెలిప్యాడ్లను ఎస్పీజీ అధికారు లు ఆధీనంలోకి తీసుకున్నారు. అటువైపు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించారు. వీవీఐపీలు, వీఐపీ లు సంచరించే హెలిప్యాడ్, సభా ప్రాంగణం, రహ దారి వెంబడి బందోబస్తు విధులు కేటాయించిన సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ అవాంఛనీయ సం ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తలు తీసుకోవాలని ఐజీ పాలరాజు ఆదేశించారు. సభ ముగిసి నేతలు తిరుగు పయనమయ్యే వరకు అప్రమత్తంగా ఉంటూ విధులు నిర్వర్తించాలని సూచించారు. ఐజీ, ఎస్పీ రవిశంకర్‌రెడ్డి మరో ఆరుగురు ఎస్పీలు, 11 మంది ఏఎస్పీలు, 27 మంది డీఎస్పీలు, 82 మంది సీఐలు, 256 మంది ఎస్‌ఐలు సహా 3900 మంది పోలీసులతో కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఎస్పీలకు సూచనలిస్తున్న ఐజీ పాలరాజు



సభా ప్రాంగణంలో వేసిన కుర్చీలు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పుల్లారావు,ఆలపాటి తదితరులు



బందోబస్తు ఏర్పాట్లలో పోలీసులు



ట్రయల్‌రన్‌లో భాగంగా సభా ప్రాంగణంలో దిగుతున్న హెలికాప్టర్లు

మహిళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలు

సభా ప్రాంగణాన్ని బ్లాక్ లు గా విభజించారు. మహి ళల కోసం ప్రత్యేకంగా గ్యాలరీలను కేటాయించారు. సభ ఏర్పాట్లను మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లా రావు, ఆలపాటి రాజేంద్రప్రసాద్, ఆనం రాంనారా యణరెడ్డి, ఎమ్మెల్యే ఉండవల్లి శ్రీదేవి, రామరాజుల తో పాటు బీదా రవిచంద్ర, దామచర్ల సత్య తదితర నేతలు శనివారం పరిశీలించారు. అధినేత లతో పాటు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నా యు డు, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు దగ్గుబాటి పురందేశ్వరి, జన సేన పీఏసీ ఛైర్మన్ నా దెండ్ల మనోహర్, టీడీపీ జాతీ య కార్యదర్శి నారా లోకేశ్, సినీనటుడు, ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణలతో పాటు కూటమి ముఖ్య నేతలు సభకు హాజరు కానున్నట్లు సమాచారం. ప్రధాని సభకు వస్తున్న నేపథ్యంలో భద్రతా చర్యల్లో భా గంగా జాతీయ రహదారిపై ఆదివారం ఉదయం 9 గంటల నుంచి ట్రాఫిక్‌ను మళ్లించేందుకు పోలీసులు ప్రత్యేక చర్యలు చేపట్టారు.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న మనోహర్ తదితరులు



స్వాగత ద్వారాల ఏర్పాటు

ప్రధాని మోదీ పర్యటన ఇలా..

బొప్పూడిలో ఆదివారం జరిగే ఎన్‌డీఏ ప్రజాగళం బహిరంగ సభకు ప్రధానమంత్రి నరేంద్రమోదీ హాజరుకా నున్నా రు. మోదీ పర్యటన షెడ్యూల్ ఖరారైనట్లు అధికా రులు ప్రకటించారు. ఢిల్లీ విమానాశ్రయం నుంచి మోదీ ఆది వారం సాయంత్రం 4.10 గంటలకు ప్రత్యేక విమా నం లో గన్నవరం విమానాశ్రయానికి చేరుకుంటారు. 4.20కి గన్న వరం నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బొప్పూ డికి బయలు దేరతారు. 4.50కి బొప్పూడిలో ఏర్పాటు చేసిన హెలి ప్యాడ్‌లో ల్యాండ్ అవుతారు. 5.10కి ప్రజాగళం బహి రంగ సభ వేదిక పైకి చేరుకుంటారు. ఈ సంద ర్భంగా ప్రధానిని టీడీపీ అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షుడు పవన్ కల్యాణ్, బీజేపీ రాష్ట్ర అధ్యక్షు రాలు దగ్గుబాటి పురందేశ్వరి సత్కరిస్తారు. సాయంత్రం 5.20 నుంచి 5.25 మధ్య పవన్ కల్యాణ్, 5.25 నుంచి 5.30 వరకు పురందేశ్వరి, 5.30 నుంచి 5.45 వరకు చం ద్రబాబు ప్రసంగిస్తారు. 5.45 గంటలకు మోదీ ప్రసం గం ప్రారంభ మౌతుంది. ఆయన ప్రసంగాన్ని పురందే శ్వరి తెలుగులో అనువాదం చేస్తారు. 6.50 గంటల కల్లా మోదీ పర్యటన ముగించుకుని బొప్పూడిలో ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ నుంచి బయలుదేరి రాత్రి 7.20కి గన్న వరం చేరుకుంటారు. రాత్రి 7.30 గంటలకు గన్నవరం నుంచి హైదరాబాద్ బేగంపేట విమానశ్రయానికి వెళతారు.

గ్రూపు-1 పరీక్షలకు పటిష్ట బందోబస్తు

- 23 కేంద్రాలు.. 15040 మంది అభ్యర్థులు
- గుంటూరు బస్టాండ్, రైల్వేస్టేషన్, హిందూ కళాశాల వద్ద హెల్ప్ డెస్కులు

గుంటూరు, మార్చి 16: గ్రూపు - 1 ప్రిలిమినరీ పరీక్షలకు పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తుషార్‌డూడీ తెలిపారు. 23 కేంద్రాల్లో ఈ పరీక్షలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పరీక్షలకు 15 వేల 40 మంది అభ్యర్థులు హాజరుకానున్నట్లు తెలిపారు. పరీక్షా కేంద్రాల వద్ద పకడ్బందీ బందో బస్తు ఏర్పాటు చేశారు. ప్రశ్నపత్రాలను సెంటర్లకు చేరవేసేందుకు ఆయా రూట్లలో సాయుధ ఎస్కార్ట్ సిబ్బందిని నియమించారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు కేంద్రాల్లోకి ఉదయం 9.45 గంటల వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. రెండో పరీక్షకు మధ్యాహ్నం 1.45 వరకు అనుమతిస్తారు. కేంద్రంలోకి ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించరు. మాల్ ప్రాక్టీస్ జరగకుండా ప్రతి ఒక్క అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేసేందుకు ఆయా పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే అభ్యర్థుల సౌకర్యార్థం పరీక్షా కేంద్రాల వివరాల కొరకు గుంటూరు రైల్వేస్టేషన్ తూర్పు, పశ్చిమ ద్వారాల వద్ద, ఆర్టీసీ బస్టాండ్, హిందూ కళాశాల కూడలి వద్ద పోలీస్ హెల్ప్‌డెస్కులను ఏర్పాటు చేసినట్లు ఎస్పీ తెలిపారు. కేంద్రాలకు చేరుకునే రూట్, కళాశాల వివరాల సమాచారాన్ని హెల్ప్‌డెస్క్ వద్ద తెలుసుకోవచ్చన్నారు. డయల్-100, 8688831568, 8688831392 నెంబర్లకు ఫోన్ చేసి కేంద్రాలకు చేరుకునే సమాచారాన్ని అభ్యర్థులు తెలుసుకో వచ్చన్నారు.



పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెలుగా అలంకృతులైన శ్రీనృసింహస్వామి, శ్రీదేవి, భూదేవీ అమ్మవార్లు

పెండ్లికుమారుడి శోభలో నృసింహుడు

- మంగళాద్రిలో బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

మంగళగిరి సిటీ, మార్చి 16: మంగళాద్రి శ్రీలక్ష్మీనృసింహ స్వామి వారు పెండ్లి కుమారుడయ్యారు. శ్రీవారి వార్షిక బ్ర హ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ అర్చకులు దిగువ సన్నిధి లోని నృసింహస్వామి, శ్రీదేవీ, భూదేవీ అమ్మవార్ల ఉత్సవమూ ర్తులను శనివారం ఉదయం పెళ్లి కుమారుడు, పెళ్లి కుమార్తె లుగా అలంకరించారు. పట్టణ పద్మశాలీయ బహూత్తమ సం ఘం తరపున ఆ సంఘం ప్రతినిధులు షరాబ్ బజారులోని రెండు రామమందిరాల వద్ద నుంచి స్వామివారికి పట్టు వస్త్రాలను తీసుకువచ్చారు. అనంతరం గర్భాలయంలో పెండ్లి కుమారుని ఉత్సవాన్ని నిర్వహించారు. తర్వాత నృసింహస్వా మిని పెండ్లి కుమారునిగా అలంకరించారు. భక్తులు పెద్ద సం ఖ్యలో స్వామివారిని దర్శించు కున్నారు. ఉత్సవాన్ని ఆలయ ప్రధాన అర్చకులు దివి అనంత పద్మనాభా చార్యులు, శ్రీని వాస దీక్షితులు నిర్వహించగా, కార్య నిర్వహణ ఎ.రామకోటిరెడ్డి ఉత్సవ ఏర్పాట్లను పర్యవేక్షించారు. స్వామివార్లకు పట్టువస్త్రాలు సమర్పించిన వారిలో చింతక్రింది కనకయ్య, దామర్ల కుబేరస్వామి, రామనాథం పూర్ణ చంద్రరావు, డాక్టర్ మునగపాటి వెంకటేశ్వరరావు, గంజి రవీంద్ర నాథ్, గంజి చిరంజీవి, వంగర పెదలక్ష్మయ్య, కొల్లి ప్రసాద్, బిట్రా ప్రసాద్, జే.బిక్షారావు, కొల్లి శివాజీ, దామర్ల మోహన్ వున్నారు.

నృసింహుని గ్రామోత్సవం... పెండ్లి కుమారుడైన శ్రీలక్ష్మీనృసింహస్వామి వారు ఉభయ దేవేరులతో కలిసి శనివారం రాత్రి గ్రామోత్సవంలో పాల్గొన్నారు. దేవస్థానం వద్ద నుంచి ప్రారంభమైన గ్రామోత్సవం మెయిన్ బజారు మీదుగా మిద్దె సెంటరు వరకు చేరుకుని తిరిగి అదే మార్గంలో ఆలయానికి విచ్చేసింది.

ఆంధ్రులకిక.. విముక్తి

- నేటి నుంచి ఐదు కోట్ల ఆంధ్రులకు స్వేచ్ఛావాయువులు
- టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- జగన్మోహన్‌రెడ్డి అనే శనిగ్రహం నుంచి ప్రజలకు విముక్తి
- నేటితో రాష్ట్రానికి పట్టిన దరిద్రం వదిలిపోతుంది
- బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ దవాడే

2లో..



ఆత్మీయ సమావేశంలో టీడీపీ, బీజేపీ, జనసేన నాయకులు

ముగిసిన నామినేషన్ల స్వీకరణ

- గుంటూరు బార్ అసోసియేషన్ అధ్యక్ష పదవికి ద్విముఖ పోరు

గుంటూరు(లీగల్), మార్చి 16: గుంటూరు బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గ ఎన్నికలకు నామినేషన్ల ఘట్టం శనివారం ముగి సింది. ఈనెల 28న ఎన్నికలు జరగనున్నాయి. అధ్యక్ష పదవికి యంగల శెట్టి శివసూర్య నారాయణ(బబ్లూ), కాసు వెంకటరెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఉపాధ్యక్ష పదవికి ఏపీ లాలి, మాలె దేవరాజు, చింతా రామకోటిరెడ్డి, బీవీ గౌరీశంకర్ నామినేషన్‌లు వేశా రు. ప్రధాన కార్యదర్శి పదవికి గురజాల అనూరాధ, లక్కీ సుబ్బయ్య, యారసాని అజయ్ కుమార్, మోదుకూరి శ్రీని వాసరావు పోటీపడుతున్నారు. సంయుక్త కార్యదర్శి పదవికి ఇల్లూరి విజయ్‌వర్మ, కట్ట నరసింహం, క్రీడలు, సాంస్కృ తిక కార్యదర్శి పదవికి సయ్యద్ ఇస్మాయిల్, పూడోట రాజేష్ లింగం, గండికోట శేషగిరిరావు, కోశాధికారి పదవికి కాలె దేవదాసు, మేడికొండు మల్లికార్జునరావులు నామి నేషన్‌లు వేశారు. గ్రంథాలయ కార్యదర్శి పదవికి పల్లే నరసింహరావు, బొప్పా శ్రీనివాసరావు, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి కూనిశెట్టి ప్రమీల, నాలుగు సీనియర్ ఎగ్జిక్యూ టివ్ పదవులకు పసుమర్తి అంకమ్మరావు, కొమ్మినేని చంద్రశేఖర్, కొమ్మా రమేష్, ఎస్‌బీఏ ఝాన్సీ నలుగురు నామినేషన్లు వేశారు. వీరి ఎన్నిక కూడా ఏకగ్రీవమైంది. లేడీ ఎగ్జిక్యూటివ్ పదవికి పులి ప్రత్యూష ఒక్కరే నామినేషన్ దాఖలు చేశారు. మూడు జూనియర్ ఎగ్జిక్యూ టివ్ పదవులకుగాను బర్మా రాజశేఖర్, ఆలూరి ప్రశాంతి, షేక్ రిహాన బేగం, రాయపూడి శ్రీనివాసరావు, షేక్‌మస్తాన్ వలి, తోట నాగసాయిరాం మోర్ల వెంకటకృష్ణ నామినేషన్లు వేశారు. నామినేషన్ల, పరిశీలన ఉపసంహ రణల అనం తరం ఈనెల 19న సాయంత్రం అభ్యర్థుల తుది జాబితా ను ప్రకటించనున్నారు. ఈనెల 28న ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 4.30 వరకు పోలింగ్ నిర్వహించి ఆ వెంటనే ఓట్ల లెక్కింపు, రాత్రికి ఫలితాలను వెల్లడిస్తామని బార్ అసోసియేషన్ ప్రస్తుత అధ్యక్షుడు, ఎన్నికల అధికారి కేవీకే సురేష్ తెలిపారు.

సమన్వయకర్తలకే.. ఛాన్స్

- వైసీపీ అసెంబ్లీ అభ్యర్థుల ఖరారు
- గుంటూరు లోక్‌సభ అభ్యర్థి కిలారి రోశయ్య

గుంటూరు, మార్చి 16: గుంటూరు లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో ఎంపీ తో పాటు అసెంబ్లీ స్థానాల్లో పోటీ చేసే వైసీపీ అభ్యర్థుల పేర్లు ఖరార య్యాయి. సీఎం జగన్ శనివారం ప్రక టించిన జాబితాలో తెనాలిలో సిట్టింగ్ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌కే ఛాన్స్ దక్కింది. మిగిలిన ఆరు నియో జకవర్గాల్లో ఇప్పటికే సమన్వయకర్త లుగా ప్రకటించిన వారినే ఖరారు చేశా రు. గుంటూరు లోక్‌సభ వైసీపీ అభ్యర్థిగా పొన్నూరు ఎమ్మెల్యే కిలారి వెంకటరోశయ్య పేరును ప్రకటించారు. చిలకలూరిపేట నుంచి బదిలీపై వచ్చి న మంత్రి విడదల రజిని గుం టూరు పశ్చిమ బరిలో నిలవనున్నారు. గుం టూరు తూర్పు నుంచి ఎమ్మెల్యే ముస్త ఫా కుమార్తె షేక్ నూరిఫాతిమాను ఎంపిక చేశారు. ప్రత్తిపాడు ఎమ్మెల్యే మేకతోటి సుచరితను తాడికొండ నుం చి బరిలోకి దింపారు. ఇక పొన్నూరు అసెంబ్లీ స్థానానికి అంబటి మురళి, ప్రత్తిపాడుకు బలసాని కిరణ్‌కుమార్, మంగళగిరికి మురుగుడు లావణ్య పేర్లను ఖరారు చేశారు.

ప్రజాగళంను విజయవంతం చేయండి : ఆనందబాబు



వేమూరులో టీడీపీ జనసేన సంయుక్త సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆనందబాబు

వేమూరు, మార్చి 16: తెలుగుదేశం, జనసేన, బీజేపీ పార్టీలు సంయుక్తంగా చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి గ్రామం వద్ద ఆదివారం నిర్వహించనున్న ప్రజాగళం మహాసభను విజయవంతం చేయాలని మాజీమంత్రి, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యులు, జనసేన, టీడీపీ ఉమ్మడి అభ్యర్థి నక్కా ఆనందబాబు పిలుపునిచ్చారు. వేమూరులో శనివారం నిర్వహించిన నియోజకవర్గ స్థాయి జనసేన, టీడీపీ విస్తృత స్థాయి సంయుక్త సమావేశానికి బాపట్ల పార్లమెంటరీ టీడీపీ అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షత వహించారు. ఆనందబాబు మాట్లాడుతూ ఎన్నికల కోడ్ రావడంతో రాష్ట్రానికి పట్టిన జగన్ పీడ విరగడ కానుందన్నారు. ఎన్నికల నిబంధనలకు అధికారులు కానీ, అధికార పార్టీ వారు కానీ వ్యతిరేకంగా వ్యవహరిస్తే పార్టీ శ్రేణులు అప్రమత్తంగా ఉండి ఫొటోలు, వీడియోలు తీసి పార్టీ సెల్‌కు అందజేయాలన్నారు. తద్వారా ఎన్నికల కమీషన్‌కు ఫిర్యాదు చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ ఇన్‌చార్జిగా ఉన్న వైసీపీ నాయకుడు వరికూటి అశోక్‌బాబు ఓట్ల కోసం కోట్లు ఎరవేసే ప్రక్రియను ప్రారంభించాడని విమర్శించారు. తెలుగుదేశం పార్టీ వలంటీర్లకు వ్యతిరేకం కాదని, ప్రస్తుతం ఉన్న విధానాలను అమలు పర్చడం జరుగుతుందన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ద్వారా సంపదను సృష్టించి అభివృద్ధిని సాధిస్తామన్నారు. సొంత చెల్లి, బాబాయి కూతురే జగన్‌కు ఓటు వేయవద్దని ప్రకటించడం ద్వారా జగన్ రాక్షసత్వం తెలుస్తోందన్నారు. రాష్ట్రంలో వన్‌సైడ్ వేవ్ ఉందని దాన్ని పార్టీల శ్రేణులు ముందుకు తీసుకువెళ్ళే బాధ్యత తీసుకోవాలన్నారు ప్రతి బూత్ లెవల్‌లో ప్రతిరోజు శ్రేణులు శ్రమించాలన్నారు. 80సంవత్సరాలు దాటిన వారిని వికలాంగులను గుర్తించి ఒక జాబితాను తయారు చేసి కమీషన్ ఆదేశాల మేరకు వారి ద్వారా ఇంటి వద్ద నుంచే ఓటు వేయించే ప్రక్రియను ప్రచారం చేయాలన్నారు. సమావేశంలో టీడీపీ నాయకులు దండే వెంకట సుబ్బారావు, మైనేని మురళీకృష్ణ, డాక్టర్ కనగాల మధుసూదనప్రసాద్, శివారెడ్డి, వాకా శేషుబాబు, గూదేటి ఎల్లారెడ్డి, జనసేన సమన్వయ కర్త ఊసా రాజేష్, జిల్లా అధ్యక్షురాలు సోమరౌతు అనురాధ, అమ్మిశెట్టి శ్రీరామమూర్తి, విష్ణుమొలకల శ్రీనివాసరావు, ఐదు మండలాల పరిధిలోని రెండు పార్టీల వివిధ విభాగాలకు చెందిన శ్రేణులు, కార్యకర్తలు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

ఆంధ్రులకిక.. విముక్తి

- ఐదు కోట్ల ఆంధ్రులకు స్వేచ్ఛా వాయువులు ● టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు
- దరిద్రం వదిలిపోతుంది ● బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ దవాడే
- రాష్ట్రాభివృద్ధి, భవిష్యత్తు కోసమే ఉమ్మడి పోరు: పురందేశ్వరి
- అయోధ్యలా అమరావతిని నిర్మించుకుందాం: పెమ్మసాని



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న టీడీపీ నేతలు

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): 'రాష్ట్రంలో గడిచిన ఐదేళ్లుగా దుర్మార్గపు పాలన కొనసాగుతోంది. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అరాచకాలకు పాల్పడటం దారుణం. ఈ రోజుతో ఐదుకోట్ల ఆంధ్రులకు స్వేచ్ఛ లభించబోతోంది' అంటూ తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చెన్నాయుడు వ్యాఖ్యానించారు. గుంటూరులోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం టీడీపీ- జనసేన- బీజేపీ కూటమి గుంటూరు పార్లమెంటు స్థాయి ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ పునర్నిర్మాణం కోసం రాష్ట్రంలో కూటమి ఏర్పాటు చేసి టీడీపీ- జనసేన- బీజేపీ ఎన్నికల్లో పోటీకి రావడంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్రాన్ని పునర్నిర్మించుకోవాలంటే ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పనిచేయాలని కోరారు. పొత్తులో కొన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రయోజనాల రీత్యా వాటిని అర్థం చేసుకుని, అరమరికలు లేకుండా పనిచేయాలని కార్యకర్తలకు ఆయన సూచించారు. బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి వినోద్ ధావడే మాట్లాడుతూ రాబోయే ఎన్నికల్లో బీజేపీ- టీడీపీ- జనసేన కూటమి భారీ మెజారిటీతో విజయం సాధించబోతుందన్నారు. జగన్మోహన్‌రెడ్డి అనే శనిగ్రహం నుంచి ఏపీ ప్రజలకు విముక్తి కలగబోతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో టీడీపీ గుంటూరు ఎంపీ అభ్యర్థి పెమ్మసాని విజయానికి కూటమిలోని పార్టీలన్నీ ఏకమై గెలిపించాలని కోరారు. మోదీ ఆధ్వర్యంలో దేశం అభివృద్ధి పథంలో నడుస్తోందని, రాబోయే రోజుల్లో ఏపీని అభివృద్ధి పథంలో పరుగులు పెట్టించడం ఖాయమని అన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి మాట్లాడుతూ చిలకలూరిపేటలో ఎన్‌డీఏ కూటమి ప్రజాగళం సభను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర అభివృద్ధి, భవిష్యత్ కోసం మూడు పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేస్తున్నామన్నారు. ఆదివారం చిలకలూరిపేటలో జరిగే సభ కూటమి విజయానికి తొలి అడుగు అని స్పష్టం చేశారు. టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని మాట్లాడుతూ బీజేపీ నేతలు అయోధ్య నిర్మాణాన్ని చేపట్టినట్లుగా ఏపీ పునర్నిర్మాణానికి సహకరిస్తారని మనసారా కోరుకుంటున్నానన్నారు. రాబోయే ఎన్నికల్లో కూటమి అభ్యర్థుల విజయం నల్లేరు మీద నడక లాంటిదన్నారు. బీజేపీ, జనసేన కూటమి డబుల్ ఇంజన్ లాగా అభివృద్ధి పథంలో దూసుపోవడం ఖాయం అని ఆశాభావం వ్యక్తంచేశారు. రాబోయే ఎన్నికల్లో వైసీపీ అధినేత జగన్మోహన్‌రెడ్డి తిరోగమనం ఎలా ఉంటుందో చవిచూడడానికి సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. సమావేశంలో జనసేన పీఏసీ చైర్మన్ నాదెండ్ల మనోహర్, టీడీపీ గుంటూరు జిల్లా అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్, తూర్పు, పశ్చిమ నియోజకవర్గాల అభ్యర్థులు మొహమ్మద్ నసీర్, పిడుగురాళ్ల మాధవి, పశ్చిమ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర, బీజేపీ నేత నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

పెమ్మసాని ఆధ్వర్యంలో చేరికలు

టీడీపీ గుంటూరు పార్లమెంటు అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్ ఆధ్వర్యంలో పలువురు టీడీపీలో చేరారు. తాడికొండ మండలం రావెల గ్రామానికి చెందిన మార్కెట్ యార్డ్ మాజీ చైర్మన్ కొమ్మినేని రామచంద్రరావు ఆధ్వర్యంలో 600 కుటుంబాలు నేడు టీడీపీలో చేరాయి. వారికి పసుపు కండువా కప్పి ఆయన పార్టీలోకి ఆహ్వానించారు.

అమరజీవి ఆదర్శం కావాలి: పెమ్మసాని

ధృఢ సంకల్పం వున్న వ్యక్తి ఎంత దూరం అయినా వెళ్లగలరు అనడానికి అమరజీవి పొట్టిశ్రీరాములు నిదర్శనమని పెమ్మసాని అన్నారు. పొట్టి శ్రీరాములు 124వ జయంతి సందర్భంగా గుంటూరులోని హిందూ కళాశాల కూడలిలో వున్న శ్రీరాముల విగ్రహానికి శనివారం ఆయన పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నేటి తరం రాజకీయ నాయకులకు అమరజీవి ఆదర్శమని, ఆయన వ్యక్తిత్వం, రాజకీయం, పోరాటం చూసి చాలా నేర్చుకోవాలని చెప్పారు.అనంతరం గుంటూరు పశ్చిమ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పిడుగురాళ్ల మాధవి మాట్లాడుతూ పొట్టి శ్రీరాముల త్యాగాన్ని ప్రతీ ఒక్కరూ గుర్తుంచుకోవాలి అన్నారు. కార్యక్రమంలో గుంటూరు పశ్చిమ టీడీపీ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర బాబు(నాని), తదితరులు పాల్గొన్నారు.

ప్రజాగళం సభను జయప్రదం చేయాలి: కన్నా

సత్తెనపల్లి, మార్చి 16: చిలకలూరిపేట సమీపంలోని బొప్పూడి వద్ద ఈనెల 17వ తేదీ టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో జరిగే ప్రజాగళం బహిరంగ సభకు టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కన్నా లక్ష్మీనారాయణ శనివారం ఒక ప్రకటనలో పిలుపునిచ్చారు. రాష్ట్రాభివృద్ధి కోసం మూడు పార్టీలు కలసి రానున్న ఎన్నికల్లో పోటీ చేయనున్న నేపథ్యంలో జరుగుతున్న సభ రాష్ట్ర భవిష్యత్‌ను నిర్దేశించనుందన్నారు. మూడు పార్టీల ఉమ్మడి పొత్తు ద్వారానే రాష్ట్ర ప్రయోజనాలు నెరవేరతాయన్నారు. ఈ సభ ద్వారా టీడీపీ అధికారంలోకి రావటం ఖాయమన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు, జనసేన అధ్యక్షుడు పవన్‌కళ్యాణ్‌లు పాల్గొంటున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు పాల్గొని సభ విజయవంతంలో భాగస్వాములు కావాలని ఆయన పిలుపునిచ్చారు.

నియంత పాలన మరో 45 రోజులే : ప్రత్తిపాటి



చిలకలూరిపేట అర్బన్, మార్చి 16: దేశ చరిత్రలో ఏ పాలకుడు చేయని రీతిలో రాష్ట్ర ప్రజలను పీడించుకు తిన్న జగన్ నియంతృత్వ పాలనకు గడువు మరో 45 రోజులేనని మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ఈ సందర్భం, అవకాశం కోసమే ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న ప్రజలు జగన్ బృందానికి తగిన గుణపాఠం చెప్పటం ఖాయమన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల సందర్భంగా మీడియాతో మాట్లాడిన ప్రత్తిపాటి జగన్ ప్రభుత్వ తీరుపై నిప్పులు చెరిగారు. కోడ్ ప్రకటనతో వైసీపీ ప్రభుత్వం దమనకాండకు అడ్డుకట్ట పడిందని, ఈ రూపంలో ప్రజలకు కొంత ఊరట లభించిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసీపీని చిత్తుచిత్తుగా ఓడించాలని ప్రత్తిపాటి పిలుపునిచ్చారు. జగన్ ఐదు సంవత్సరాల విధ్వంసక పాలనలో రాష్ట్రాన్ని నాశనం చేశారని, ఎస్సీ, ఎస్టీల 28 పథకాలు, బీసీల పథకాలు 30, మైనార్టీలకు చెందిన 11 సంక్షేమ పథకాలను రద్దు చేసిన జగన్ పాలనకు ముగింపు పలికే సమయం ఆసన్నమైందన్నారు. జగన్‌రెడ్డికి ఓటు వేయవద్దని సొంత చెల్లెలు చెపుతుందన్నారు. తాడేపల్లి ప్యాలెస్ నుంచే కాదు ఈ రాష్ట్రం నుంచి కూడా ప్రజలు జగన్‌రెడ్డిని తరిమి కొట్టబోతున్నారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు.

మాకొద్దీ అడ్డగోలు వైసీపీ పాలన

- 1551వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు



మందడం రైతు ధర్నా శిబిరంలో బిల్డ్ అమరావతి అంటూ నినాదాలు చేస్తున్న రైతులు

తుళ్ళూరు, మార్చి 16: మాకొద్దు అడ్డగోలు వైసీపీ పాలన అని రాజధానికి 33వేల ఎకరాల భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు మహిళలు చేస్తున్న ఆందోళనలు, నిరసన దీక్షలు 1551వ రోజుకు చేరుకున్నాయి. ఈ సదర్భంగా రైతు ధర్నా శిబిరాల నుంచి వారు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ జీవనాడి పోలవరం నీటి ప్రాజెక్టు పూర్తి చేయకుండా తాత్సారం చేస్తూ వచ్చారన్నారు. విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ ప్రవేటు పరం అవుతుంటే సీఎం జగన్‌రెడ్డి నోరు మెదపటం లేదన్నారు. ఏ ప్రాజెక్టు పూర్తి చేయలేదన్నారు. రాష్ట్రంలో ఈ ఐదేళ్లలో ఎటువంటి అభివృద్ధి కనబడటం లేదన్నారు. అప్పుల మాత్రం లక్షల కోట్లలో కనబడుతున్నాయన్నారు. అమరావతి నిర్వీర్యంతో రాష్ట్ర భవిష్యత్ ప్రశ్నార్థకమైందన్నారు. మూడు రాజధానులతో ఆంధ్రప్రదేశ్ ఉనికికే ప్రమాదం ఏర్పడిందన్నారు. అమరావతే స్థిరమైన రాష్ట్ర ఏకైక రాజధాని అని పేర్కొన్నారు. హైకోర్టు తీర్పును అమలు చేసి చిత్తశుద్ధిని సీఎం జగన్‌రెడ్డి చాటుకోవాలన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. దీపాలు వెలిగించి బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలతో పాటు తాడికొండ, మంగళగిరి నియోజకవర్గాల్లో ఆందోళనలు కొనసాగాయి.

దోచుకొని దాచుకోవడం వైసీపీ నేతల నైజం

- 500 ఎకరాలు ఆక్రమణకు గురైనా దిక్కులేదు
- గ్రావెల్ తరలించేది ఎమ్మెల్యే మనుషులే
- మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ పెదపిచ్చయ్య ఆవేదన



మార్కెట్ యార్డు అధికారికి రాజీనామా పత్రాన్ని అందజేస్తున్న నడికూడి మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ తగుళ్ల పెదపిచ్చయ్య

పిడుగురాళ్ల, మార్చి 16: ముప్పై ఏళ్లుగా నా సేద్యంలో వున్న పొలాన్ని కూడా కొందరు వైసీపీ నేతలు లాగేసుకున్నారు. నా వద్ద అన్ని ఆధారాలు వున్నాయని చెబుతున్నా పట్టించుకోలేదు. గురజాల నియోజకవర్గంలో అంతా ఒకరిదే పెత్తనం అంటూ నడికూడి మార్కెట్ యార్డు వైస్‌చైర్మన్, బీసీ సామాజికవర్గనేత, వైసీపీకి చెందిన తగుళ్ల పెదపిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. శనివారం మార్కెట్ యార్డులో అధికారులకు తన రాజీనామా పత్రాన్ని అందజేశారు. అనంతరం విలేకర్లతో మాట్లాడుతూ ఏళ్లుగా వైసీపీ కోసం పని చేస్తున్నా. మా గ్రామ సర్పంచ్‌ని కూడా గెలిపించుకున్నా ఎటువంటి ఉపయోగం లేదు. కనీసం చిన్నపని కూడా చేయించుకోలేకపోతున్నాం. నాలుగు ఎకరాలు లీజుకు తీసుకొని 170 ఎకరాల్లో మట్టి తోలేసుకుంటున్నారని తెలిపారు. గురజాలలో తహసీల్దారు ఆఫీసులో రికార్డులన్నీ అమ్మేసుకుంటారు అని ఆరోపించారు. నియోజకవర్గంలో సీనియర్‌లకు గౌరవం లేదు.. కనీసం పాఠశాల వాచ్‌మెన్‌ను, అంగన్‌వాడీని మార్చుకునే హక్కు లేనప్పుడు పార్టీలో కొనసాగటమెందుకో అర్థంకావడం లేదు. సర్పంచ్ చెప్పినా కూడా చేయకుండా మరొకరు చెబితే ఆ పనులు చేయడం ఎంతో బాధించింది. నియోజకవర్గంలో 500 ఎకరాల భూములు దోచుకుంటున్నా దిక్కేలేదు. గురజాలలో అంతా ఒక్కరిదే పెత్తనం. నియోజకవర్గం మొత్తం మట్టి తోలకాలు జరిపించేది ఎమ్మెల్యే కాసు మనుషులేనని అందరికీ తెలిసిందేనన్నారు. ఎన్నో ఏళ్లుగా రాజకీయాల్లో వుంటున్నా ఇంతటి అగౌరవం, అరాచకం ఎన్నడూ చూడలేదని పెదపిచ్చయ్య ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం తాను ఏ పార్టీలో చేరడం లేదని, తరువాత నిర్ణయాన్ని వెల్లడిస్తానని పెదపిచ్చయ్య వివరించారు.

అప్పుడే ఉల్లం'ఘనులు'

- పొన్నూరులో జడ్పీ అతిథిగృహంలో పార్టీ కార్యకలాపాలు
- వెనిగండ్లలో వలంటీర్లతో వైసీపీ అభ్యర్థి అంబటి సమావేశం
- నరసరావుపేటలో ఎమ్మెల్యేతో వైద్య ఆరోగ్యశాఖ ఉద్యోగుల భేటీ



వైసీపీ అభ్యర్థి అంబటి మురళితో కలిసి పొన్నూరులో సిద్ధం ప్లకార్డులు ప్రదర్శిస్తున్న వలంటీర్లు, నరసరావుపేట ఎమ్మెల్యేని కలిసిన వైద్య, ఆరోగ్య శాఖ ఉద్యోగులు



కోడ్ వచ్చిన తర్వాత కూడా పెదకాకాని మండలం వెనిగండ్లలో వలంటీర్లతో సమావేశం నిర్వహించిన పొన్నూరు అసెంబ్లీ వైసీపీ అభ్యర్థి అంబటి మురళీకృష్ణ

గుంటూరు సిటీ, మార్చి 16: ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చిన రోజే ఉల్లంఘనకు తెరలేచింది. షెడ్యూల్ విడుదలైన తర్వాత ఉమ్మడి గుంటూరు జిల్లాలో అధికారులు, రాజకీయ నాయకులు నియమావళిని త్రోసిరాజన్నారు. పొన్నూరు పంచాయతీరాజ్ అతిథి భవనాన్ని కొద్దిరోజులుగా అధికార వైసీపీ కార్యకలాపాలకు వినియోగిస్తున్నారు. శనివారం మధ్యాహ్నం అక్కడ వలంటీర్లతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వైసీపీ నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. జిల్లా పరిషత్‌కు చెందిన అతిథి గృహంలో పార్టీ బ్యానర్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేసి పూర్తిగా పార్టీ కార్యాలయంలా మార్చేశారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత కూడా ఈ అతిథిగృహంలో పార్టీ కార్యకలాపాలు జరుగుతున్నా జిల్లా పరిషత్ అధికారగణం నిమ్మకు నీరెత్తినట్లుగా చూస్తూ ఉండిపోయింది. స్థానిక జడ్పీటీసీ తన సోదరుడు పేరుతో పంచాయతీరాజ్ అతిథి గృహాన్ని అద్దెకు తీసుకుని పార్టీ కార్యక్రమాలకు వినియోగిస్తున్నట్లు తెలుస్తోంది. ముందస్తు ప్రణాళికతోనే గెస్ట్‌హౌస్‌ను ప్రయివేటు వ్యక్తులకు కట్టబెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. ప్రయివేటు వ్యక్తికి అద్దెకు ఇచ్చాం కాబట్టి అక్కడ ఏమి జరిగినా తమకు సంబంధం లేదన్న వాదనను పాలక వర్గంలోని కొందరు వాదిస్తున్నారు. అత్యంత వివాదాస్పదంగా మారిన ఈ వ్యవహారంలో జిల్లా పరిషత్ ఉన్నతాధికారులు కొంత ఉదాసీనత పాటిస్తున్నారన్న ఆరోపణలు వస్తున్నాయి. అధికారులు చూసీ చూడనట్లు వదిలేయడం వల్లే పంచాయతీ రాజ్ అతిథి గృహాన్ని పార్టీ కార్యాలయంగా మార్చేశారని ప్రతిపక్ష నేతలు విమర్శిస్తున్నారు. శనివారం సాయంత్రం అతిథి గృహంలో జరిగిన కార్యక్రమంపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం వెనిగండ్లలోని మైత్రి కల్యాణ మండపంలో మండలంలోని వలంటీర్లతో పొన్నూరు అభ్యర్థి అంబటి మురళీకృష్ణ ఎన్నికల కోడ్ వచ్చిన తర్వాత సమావేశం నిర్వహించడం చర్చనీయాంశమైంది. కోడ్ వచ్చిన తర్వాత సమావేశం జరిగినా అధికారులు పట్టిం చుకోకపోవడంతో ప్రత్యర్థి పార్టీల నేతలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

స్వామి భక్తిని చాటిన ఉద్యోగులు

నరసరావుపేటలో వైద్య, ఆరోగ్యశాఖలో పనిచేసే కొందరు ఉద్యోగులు శనివారం సాయంత్రం అక్కడ ఎమ్మెల్యేను కలవటం వివాదాస్పదంగా మారింది. ఉద్యోగాలు క్రమబద్దీకరణ చేసారంటూ కృతజ్ఞతలు తెలిపేందుకు ఎమ్మె ల్యే వద్దకు వెళ్లినట్లుగా ఫొటోలు విడుదల య్యాయి. 'థాంక్యూ సీఎం సర్'అంటూ ఉద్యోగులు ప్లకార్డులు చేబూని ఎమ్మెల్యేతో ఫొటోకి ఫోజులిచ్చారు. కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత ఉద్యోగులు ఎమ్మెల్యేను కలవటంతో ప్రతిపక్ష పార్టీ సోషల్ మీడియాలో ఆ ఫొటోలను షేర్ చేసింది.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

- విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.20
- నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	111, 119,130
చికెన్ విత్ స్కిన్	210.00
చికెన్ స్కిన్ లెస్	220.00

కోడ్ అమలుకు పకడ్బందీ చర్యలు

● కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డి ఆదేశం

గుంటూరుసిటీ, మార్చి 16: జిల్లాలో నిస్పక్షపాతంగా సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళిని అమలు జరిగేలా అధికారులు పకడ్బందిగా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ వీసీ సమావేశ మందిరంనుంచి కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి సార్వత్రిక ఎన్నికల ప్రవర్తన నియమావళిపై రిటర్నింగ్ అధికారులు, ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏజెన్సీల నోడల్ అధికారులు, జిల్లా, రెవెన్యూ, మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బడ్జెట్ ప్రొవిజన్ ఉన్నప్పటికీ నూతన ప్రాజెక్టులు, పథకాల మంజూరు, కన్సెషన్లు, గ్రాంట్లు, హామీలు, శంకుస్థాపనలు పూర్తిగా నిషేధమని, వర్క్ఆర్డర్ ఉన్న క్షేత్రస్థాయిలో పనులు మొదలు కాని పనులు చేపట్టకూడదని తెలిపారు. ఆరోగ్య సురక్ష క్యాంపులు రాజకీయ నేతల చిత్రపటాలు లేకుండా యధావిధిగా కొనసాగించవచ్చన్నారు. రాష్ట్రంలో నాల్గవ విడతలో లోక్‌సభకు, శాసనసభకు ఎన్నికలు నిర్వహిస్తున్నట్లు ఎన్నికల కమిషన్ శనివారం షెడ్యూల్ ప్రకటించిందన్నారు. ఏప్రిల్ 18న ఎన్నికల నోటిఫికేషన్ జారీ, ఏప్రిల్ 25 నామినేషన్ల స్వీకరణకు తుదిగడువు, ఏప్రిల్ 26న నామినేషన్ల పరిశీలన మే13న ఎన్నికలు, జూన్ 4 లెక్కింపు జరుగుతుంద న్నారు. ఫలితాలు ప్రకటించే వరకు జిల్లాలో ఎన్నికల ప్రవర్త నియమావళి అమల్లో ఉంటుందని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో డీఆర్వో పెద్ది రోజా, ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

మార్పుకి వేదికగా 'ప్రజాగళం'

● టీడీపీ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య



గుంటూరు, మార్చి 16(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో జరగబోయే మార్పుకు వేదికగా టీడీపీ- జనసేన-బీజేపీ 'ప్రజాగళం' బహిరంగసభ ఉండబోతోందని టీడీపీ బీసీ నేత డాక్టర్ నిమ్మల శేషయ్య శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. ఈ నెల 17న బొప్పూడి సమీపంలో జరిగే ప్రజాగళం సభ రాష్ట్ర రాజకీయాల్లో ప్రత్యేకంగా నిలవ నుందన్నారు. కూటమి దెబ్బకు పోటీ చేయాలా? వద్దా? అనే దిక్కుతోచని స్థితిలో వైసీపీ నాయకులు పడ్డారని ఆయన అన్నారు. రాష్ట్రంలో ఐదేళ్లుగా ఒక దుర్మార్గుడి పాలనలో ప్రజలు రాజ్యాంగం కల్పించిన ఏహక్కుని వినియోగించుకోలేని దుస్థితిలో ఉన్నారన్నారు. రాష్ట్ర పునర్నిర్మాణం కోసమే టీడీపీ, జనసేన, బీజేపీ పొత్తు పెట్టుకున్నాయని, నిండు మనసుతో కూటమిని ఆశీర్వదించాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తిచేశారు. ప్రధాని మోదీ ప్రసంగం కోసం దేశమంతా ఎదురుచూస్తోందని అన్నారు.

లోక్ అదాలత్‌లో 2035 కేసుల పరిష్కారం

గుంటూరు(లీగల్), మార్చి 16: జిల్లాలోని వివిధ కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2035 కేసులను రాజీమార్గంలో పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి తెలిపారు. 364 సివిల్ కేసులు; 1421 క్రిమినల్ కేసులు; 250 ప్రేలిటిగేషన్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యాయని తెలిపారు. శనివారం ఉదయం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వైవీఎస్‌బీజీ పార్థసారధి మాట్లాడుతూ కక్షిదారులు లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

విలువలు కలిగిన నాయకుడు పవన్‌కళ్యాణ్

● వైసీపీ వేధింపులను తట్టుకుని నిలబడ్డాడు : పెమ్మసాని



మాట్లాడుతున్న పెమ్మసాని, పక్కన బూర్ల రామాంజనేయులు తదితరులు

గుంటూరు(తూర్పు), మార్చి16: పవన్‌కళ్యాణ్ ఒక సాధారణ వ్యక్తి కాదు, మహాశక్తి వంతుడని, వైసీపీ ప్రభుత్వం ఆయనను అనేక వేధింపులకు గురిచేసినా తట్టుకొని నిలబడ్డాడని టీడీపీ గుంటూరు పార్లమెంట్ అభ్యర్థి డాక్టర్ పెమ్మసాని చంద్రశేకర్ అన్నారు. శనివారం రూరల్‌మండలం లాలుపురం గ్రామంలో టీడీపీ, జనసేన, బీజేపీ ఆధ్వర్యంలో రాత్రి ర్యాలీ నిర్వహించారు. ప్రత్తిపాడు నియోజక వర్గ అభ్యర్థి బీ.రామాంజనే యులు, జనసేన, బీజేపీ నాయకులతో కలసి ఆయన పాల్గొన్నారు. ఈ సదర్భంగా పెమ్మసాని మాట్లాడుతూ లాలుపురం గడ్డ జనసేన అడ్డాగా మారిందని హర్షం చేశారు. మన ప్రభుత్వం అధికారంలోకి రాగానే లాలుపురం జనసైనికులను గుండెల్లో పెట్టి చూసుకుంటానని హామీ ఇచ్చారు. బూర్ల రామాంజనేయులు మాట్లా డుతూ ఎన్నికలు అనంతరం రాష్ట్రంలో వైసీపీ నేతలు పక్క రాష్ట్రాలకు పరుగు పెడతారని ఎద్దేవా చేశారు. నేడు చిలకలూరిపేటలో జరిగే సభకు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు హాజరు కావాలని పిలుపునిచ్చారు. అంతకుముందు పెమ్మసాని, బూర్ల రామాంజనేయులు గ్రామంలోని జనసేన పార్టీ కార్యాలయం వద్ద పార్టీ జెండాను ఆవిష్కరించి, అలాగే ఆటో సెంటర్లోని వంగవీటి మోహన రంగా విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పోతురాజు సమత, యర్రంశెట్టి పద్మావతి జనసేన, టీడీపీ నాయకులుతో పాటు జనసైనికులు పాల్గొన్నారు.



హాక్ ఫెస్ట్-2024 బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వై.వీ.అంజనేయులు

ఏప్రిల్ 6న 'చలపతి హాక్ ఫెస్ట్-2024'

తాడికొండ, మార్చి 16: మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో పీఎస్‌జీ టెక్నాలజీ, శాప్ సంయుక్తంగా జాతీయ స్థాయిలో పీఎస్‌జీ ఐటెక్ హాక్ ఫెస్ట్-2024 ఏప్రిల్ 6న జరుగుతుందని చలపతి విద్యాసంస్థల చైర్మన్ వై.వీ. అంజనేయులు తెలిపారు. శనివారం కళాశాలలో హాక్ ఫెస్ట్ -2024 బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. కిరణ్‌కుమార్ మాట్లాడుతూ క్రౌడ్ సోర్స్ డిజాస్టర్ మేనేజ్మెంట్, గ్రీన్ క్రెడిట్ మేనేజ్మెంట్, రెవల్యూషనైజింగ్ టూమార్రో, హార్నేజింగ్ అంశాలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. పోటీలలో పాల్గొనే టీమ్‌లలో 4 లేదా 5 మందితో ఉండాలని తెలిపారు. బీఈ, బీ.టెక్, ఎం.ఈ, ఎంటెక్, ఎంసీఏ, ఎంఎస్సీ చదువుకున్న ఏ బ్రాంచి విద్యార్థులు అర్హులని తెలిపారు. హాక్ ఫెస్ట్‌లో పాల్గొని జాతీయ స్థాయి పోటీకి ఎంపిక కావాలన్నారు. జాతీయ స్థాయిలో మొదటి బహుమతి రూ.2.50 లక్షలు, 2వ బహుమతి రూ.1.50 లక్షలు, 3వ బహుమతి రూ.లక్షలని తెలిపారు. బ్రోచర్ ఆవిష్కరణ కార్యక్రమంలో వైస్‌ప్రిన్సిపాల్ డాక్టర్ కే.నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో-ఆర్డినేటర్స్ ప్రొఫెసర్ ఎస్. శాంతి ప్రియ, డాక్టర్ బాల మురళికృష్ణ, వివిధ పాల్గొన్నారు.

ముగిసిన నోవమ్-2024 యువజనోత్సవాలు

లాం చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో రెండు రోజులుగా జరుగుతున్న నోవమ్-2024 యువజనోత్సవాలు శనివారంతో ముగిసాయి. ముఖ్య అతిథిగా వెబ్ ఇండియా టెక్నాలజీ ఇంజనీరింగ్ సెంటర్, టాలెంట్ యాక్విస్టిటన్ లీడర్ ఈ.దయాకర్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

పొట్టి శ్రీరాములు త్యాగం

అజరామరం

● 123వ జయంతి సందర్భంగా అధికారులు, నేతల నివాళి

గుంటూరు, మార్చి 16 (ఆంధ్రజ్యోతి): ఆంధ్ర రాష్ట్ర సాధనకు తన ప్రాణాన్ని తృణప్రాయంగా అర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగం అజరామరం అని కలెక్టర్ ఎం.వేణుగోపాల్ రెడ్డి అన్నారు. శనివారం పొట్టి శ్రీరాములు 123వ జయంతి సందర్భంగా స్థానిక మునిసిపల్ గెస్ట్‌హౌస్ ఎదురుగావున్న అమరజీవి విగ్రహానికి కలెక్టర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లా డుతూ పొట్టి శ్రీరాములు ఆశయ సాధకుడని, తెలుగు ప్రజలకు ఒక ప్రత్యేక రాష్ట్రం కావాలని శాంతియుతంగా నిరాహారదీక్ష చేసి ప్రాణ త్యాగం చేసి సాధించారన్నారు. ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం ఏర్పడడానికి మూల కారకుడైన అమరజీవి పొట్టి శ్రీరాములు యువతకు ఆదర్శ ప్రాయుడన్నారు.



పొట్టి శ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న అదనపు ఎస్పీ శ్రీనివాసులు



పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న కలెక్టర్, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

కార్యక్రమంలో శాసనమండలి సభ్యుడు కేఎస్.లక్ష్మణ్ రావు, సాంఘిక సంక్షేమ శాఖ డీడీ మధుసూదన్‌రావు తదితరులు పాల్గొని పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పించారు.

త్యాగధనుడు పొట్టి శ్రీరాములు

- జిల్లా క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాసరావు

గుంటూరు, మార్చి 16: ఆంధ్రరాష్ట్ర సాధన కోసం ప్రాణాలర్పించిన పొట్టి శ్రీరాములు త్యాగధనుడని జిల్లా క్రైం అదనపు ఎస్పీ శ్రీనివాస రావు అన్నారు. పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని శనివారం పోలీస్ అధికా రులు ఘన నివాళులర్పించారు. ఎస్పీ ఆదేశాల మేరకు ఏఆర్ అదనపు ఎస్పీ హనుమంతు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అదనపు ఎస్పీ వెంకటేశ్వరరావు తది తరులు పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఆర్ డీఎస్పీ శాంత కుమార్, ఆర్ఐలు శ్రీహరి రెడ్డి, బ్రహ్మానందం, స్వర్ణలత, డీపీవో ఏఏవో వెంకటేశ్వరరావు, మినిస్టీరియల్ సిబ్బంది, ముఖ్య అధికారులు పాల్గొన్నారు.

ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీకి బ్రేక్

గుంటూరు సిటీ, మార్చి 16: ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీకి జిల్లాలో బ్రేకులు పడ్డాయి. శనివారం మధ్యాహ్నం నుంచి ఎన్నికల కోడ్ అమల్లోకి రావటంతో ఆరోగ్యశ్రీకార్డుల పంపిణీని నిలిపివేయాలని జిల్లా అధికారులు ఆదేశించారు. ఈ మేరకు ఆరోగ్యశ్రీ జిల్లా కోఆర్డినేటర్ డాక్టర్ విజయప్రకాష్ అన్ని పీహెచ్‌సీలకు సమాచారం అందించారు.



గోడపత్రులు విడుదల చేస్తున్న తిలక్‌బాబు తదితరులు

పాలిసెట్, ఏపీఆర్‌జేసీకి ఉచిత శిక్షణ

గుంటూరు(విద్య),మార్చి 16: రోటరీ క్లబ్ ఆఫ్ గుంటూరు అచీవర్స్, ఎన్నారై పాలిటెక్నిక్ కళాశాల సంయుక్త ఆధ్వర్యంలో 10వ తరగతి పూర్తిచేసిన విద్యార్థులకు ఉచిత పాలీసెట్, ఏపీఆర్‌జేసీ శిక్షణా తరగతులను నిర్వహించనున్నట్లు క్లబ్ అధ్యక్షుడు పిడికిటి తిలక్ బాబు తెలిపారు. ఇందుకు సంబంధించిన గోడప్రతులను శనివారం విద్యానగర్‌లోని రోటరీ ఆఫీసులో వారు విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఈ నెల 30 నుంచి, ఉదయం 9 గంటల సాయంత్రం 4 గంటల వరకు విద్యానగర్ మెయిన్ రోడ్డు, కొత్తపేట శివాలయం వీధిలోని ఎన్నారై ఇండియన్ స్ప్రింగ్స్ స్కూలు బ్రాంచీలలో తరగతులను ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు 8309282408, 9866646712 , 9959085200 నంబర్లను సంప్రదించి పేర్లు నమోదు. చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో క్లబ్ సెక్రటరీ కల్లూరు సాంబశివరావు తదితరులు పాల్గొన్నారు.

జగన్ ప్రభుత్వం రైతులను దగా చేసింది

● సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు

మంగళగిరి, మార్చి16: వైస్ జగన్ ప్రభుత్వం రైతులను దారుణంగా దగా చేసిందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీ.శ్రీనివాసరావు అన్నారు. శనివారం మంగళగిరి సీపీఎం కార్యాలయంలోజరిగిన జిల్లా స్థాయి విస్తృత సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఏపీలో భూసమీకరణ పేరుతో 33 వేల ఎకరాలను రైతుల వద్ద తీసుకుని, రాజధానిని అభివృద్ధి చేయడం కన్నా స్పెక్యులేషన్ ద్వారా రైతులను బలిచేశారని విమర్శించారు. ప్రజల సమస్యలను పరిష్కరించడంలో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విఫలమయ్యాయని విమర్శించారు. సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబూరావు మాట్లాడుతూ రాష్ట్రంలో మళ్లీ అధికా రంలోకి రావడానికి పాలకపార్టీలు రూ.కోట్లు కుమ్మరించి ప్రయత్నిస్తు న్నాయన్నారు. సమావేశంలో సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.కృష్ణయ్య, జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నేతలు ఎం.సూర్యారావు, జేవీ రాఘవులు, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య, జొన్నా శివశంకర్‌రావు, ఈమని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల బాండ్ల పూర్తి వివరాలు బయట పెట్టాలి

ఎన్నికల బాండ్లు ఏ కంపెనీ ఏ పార్టీకి ఎంత ఇచ్చిందో పూర్తి వివరాలు ఎస్‌బీఐ బయటపెట్టాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాస రావు డిమాండ్ చేశారు. మంగళగిరిలో శనివారం ఆయన విలేకర్లతో మాట్లాడుతూ ఏ పార్టీకి ఎంత వచ్చిందో చెప్పేరే కానీ, ఏ కంపెనీ ఎంత ఇచ్చిందో చెప్పడంలేదని విమర్శించారు. ఎన్నికల బాండ్లు అతి పెద్ద కుంభకోణమన్నారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పాశం రామారావు, నేతలు జొన్నా శివశంకర్‌రావు, జేవీ రాఘవులు, ఎం.రవి, ఎస్ఎస్ చెంగయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే రాష్ట్రాభివృద్ధి : శ్రావణ్‌కుమార్

తాడికొండ, మార్చి 16: టీడీపీ తోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని తాడికొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. శనివారం తాడికొండలో ఎన్నికల ప్రచారాన్ని స్థానిక టీడీపీ నేతలతో కలిసి ఆయన చేపట్టారు. ఇంటింటికి తిరిగి సూపర్ సిక్స్‌ను పథకాలను వివరించటంతో పాటు, బీసీ డిక్లరేషన్‌పై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన తరువాత తాడికొండ అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. రాజధాని అభివృద్ధి జరగాలన్నా, సంక్షేమ పథకాలు అమలు జరగాలన్నా చంద్రబాబు నాయుడు మళ్లి సీఎం కావాలన్నారు. దానికి గాను ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పలువురు పాల్గొన్నారు.



న్యాయవిద్య విద్యార్థులతో అసద్ హుస్సేన్

చట్టాలపై సరైన అవగాహన ఉండాలి

● తెలంగాణలోని హైకోర్టు న్యాయవాది అసద్ హుస్సేన్

గుంటూరు (విద్య), మార్చి 16: విద్యార్థులు కార్పొరేట్ లా ప్రాక్టీస్ చేయాలంటే కాంట్రాక్టుల చట్టంపై సరైన అవగాహన ఉండాలని తెలంగాణలోని హైకోర్టు అడ్వకేట్ అసద్ హుస్సేన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో " కార్పొరేట్ లీగల్ ప్రాక్టీస్ అండ్ జనరల్ లిటిగేషన్ " అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అసద్ హుస్సేన్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తి ఎదుర్కోవాల్సిన సవాళ్లగురించి తెలియజేశారు. ప్రజలకోసం న్యాయ పోరాటం చేయాలనుకుంటే ముందుగా చట్టంలోని మౌలికాంశాలను అర్థంచేసుకో వాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ప్రొసీజర్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్, కార్పొరేట్ చట్టాల పరస్పర సంబంధం గురించి వివరించి న్యాయ అభ్యాసానికి పునాదిగా ఉద్బోధించారు. కంపెనీల ప్రాథమిక నిర్మాణం, చట్టపరమైన బాధ్యతలతో పాటు వాటి పనిగురించి వివరిం చారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌లా సిబ్బంది పాల్గొన్నారు.

జీఎంసీ నూతన ఎస్ఈగా శ్యామ్‌సుందర్

గుంటూరు, మార్చి 16: నగరపాలక సంస్థ నూతన ఎస్ఈగా శ్యామ్‌సుందర్ నియమితులయ్యారు. ఇప్పటివరకు పబ్లిక్ హెల్త్ ఈఈగా వ్యవహరిస్తోన్న ఆయనకు ఉద్యోగోన్నతిపై ఎస్ఈగా నియమిస్తూ శనివారం ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ మేరకు ఆయన జీఎంసీ కమిషనర్ కీర్తి చేకూరిని మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు.



టీడీపీ సీనియర్ నేత, మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావును శనివారం టీడీపీ తూర్పు ఎమ్మెల్యే అభ్యర్థి మొహమ్మద్ నసీర్ మర్యాద పూర్వకంగా కలిసి ఘనంగా సన్మానించారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)



టీడీపీ సీనియర్ నేత, మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ గుంటూరు నగర అధ్యక్షుడు డేగల ప్రభాకర్‌లను టీడీపీ గుంటూరు పశ్చిమ నియోజకవర్గ అభ్యర్థి పిడుగురాళ్ల(గళ్లా) మాదవి శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. - గుంటూరు (ఆంధ్రజ్యోతి)

ఎన్నికల కోడ్ కూత ..

● విగ్రహాలకు ముసుగులు.. ● నేతల ఫ్లెక్సీల తొలగింపు

గుంటూరు, మార్చి 16: కేంద్ర ఎన్నికల కమిషన్ సార్వత్రిక ఎన్నికల షెడ్యూల్ ప్రకటించిన నేపథ్యంలో ఎన్నికల కోడ్ శని వారం మూడు గంటల నుంచే అమల్లోకి వచ్చింది. నగరపాలక సంస్థ కమిషనర్ ఆదేశాలమేరకు నగరంలో అన్నిప్రాంతాల్లో రాజకీయ పార్టీల పోస్టర్స్, బ్యానర్స్, హోర్డింగ్స్‌ని యుద్ధప్రాతిపదికన తొలగించారు. నగరంలో వివిధ సెంటర్‌లలోనున్న నేతల విగ్రహాలకు తెల్లటి క్లాత్‌తో ముసుగులు తొడిగారు. నగరంలో కలెక్టరేట్ రోడ్డు, జిన్నాటవర్, బ్రాడీపేట మెయిన్ రోడ్డ, పట్టాభిపురం, గుజ్జనగుండ్ల, రింగ్ రోడ్డు ప్రాంతాలతో పాటు పలు ప్రాంతాల్లో ఉన్న రాజకీయ పార్టీల ఫ్లెక్సీలను యుద్ధప్రాతినదిన జీఎంసీ సిబ్బంది తొలగించారు. ఈ సందర్భంగా శనివారం నగరపాలక సంస్థ కౌన్సిల్ సమావేశ మందిరంలో సెక్టార్ అధికారులు, ఎంసీసీ అధికారులతో కమిషనర్ , తూర్పు నియోజకవర్గ రిటర్నింగ్ ఆఫీసర్ (ఆర్వో) కీర్తి చేకూరి సమావేశం నిర్వహించి నగరంలో ఎన్నికల కోడ్‌ను పకడ్బందీగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు.

కోల్డ్‌స్టోరేజ్ యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలి

● ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్

● బాధిత రైతులతో కలసి కలెక్టర్ వినతి పత్రం అందజేత

గుంటూరు(తూర్పు), మార్చి16: నిబంధనలు పాటించకుండా, రైతుల ఆస్తి పట్ల నిర్లక్ష్యం వహించిన దుగ్గిరాల, కోల్డ్ స్టోరేజ్ యాజమాని శ్యాంసుందర్‌పై సివిల్, క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఎమ్మెల్సీ కేఎస్ లక్ష్మణరావు డిమాండ్‌చేశారు. ఈమేరకు శనివారం కలెక్టరేట్‌లోని కలెక్టర్ వేణుగోపాల్ రెడ్డికి ఆప్రాంత పసుపు రైతులు, రైతు సంఘ నేతలతో కలిసి ఆయన వినతిపత్రం అందజేశారు. అనంతరం లక్ష్మణరావు మాట్లాడుతూ బీమా పేరుతో రైతుల నుంచి రూ.12 లక్షల నుంచి రూ.20 లక్షల వరకు వసూలు చేసి, రూ.4 లక్షల ప్రీమియం మాత్రమే చెల్లించారని, దీంతో రైతులు రూ.120 కోట్లు బీమా పరిహారాన్ని నష్టపోయారని ఆవేదన వ్యక్తంచేశారు. కోల్డ్‌స్టోరేజీ యాజమానిపై చర్యలు తీసుకోవాలని, అలాగే అగ్నిప్రమాదం జరిగిన తీరుపై విచారణ పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు ములకా శివసాంబిరెడ్డి, వేములపల్లి వెంకట్రామయ్య, లంకిరెడ్డి భాస్కరరెడ్డి, నాదెళ్ల చంద్రశేకర్, ప్రదీప్ రెడ్డి, కళ్లం శ్రీనివాస రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బ్రహ్మయ్య హంతకులను అరెస్ట్ చేయాలి

● తెలంగాణా మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

● నివాళులర్పించిన వివిధ పార్టీల, సంఘాల ప్రతినిధులు



సభలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య

గుంటూరు, మార్చి 16 : సుదీర్ఘ కాలం విప్లవం కోసం అంకితమై పని చేసిన నాదెండ్ల బ్రహ్మయ్యను విప్లవ పార్టీ ముసుగులో హత్యచేసిన సీపీఐ(ఎం.ఎల్) న్యూ డెమోక్రసీ చంద్రం హంతకముఠాను తక్షణం అరెస్టు చేయాలని తెలంగాణ మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. ఇటీవల హత్యకుగురైన నాదెండ్ల బ్రహ్మయ్య సంస్మరణ సభను దళిత, బహుజన, ప్రజా సంఘాల ఐక్య వేదిక ఆధ్వర్యంలో శనివారం స్థానిక డాక్టర్ బీఆర్.అంబేద్కర్‌భవన్ ప్రాంగణంలో నిర్వహించారు. సభకు న్యాయవాది శిఖాసురేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ బ్రహ్మయ్యహత్య రెండు తెలుగు రాష్ట్రాల్లో విస్తృత చర్చనీయాంశమైందన్నారు. విప్లవ కమ్యూనిస్టు పార్టీలో నేతలను ఆ పార్టీ నాయకత్వమే హత్యచేయడమన్నది ఏ విప్లవకర సిద్ధాంతమో ఆ పార్టీ నేతలే చెప్పాలన్నారు. బ్రహ్మయ్యను తామే హత్య చేశామని హంతకులు ప్రకటన చేసినా పోలీసులు ఇంతవరకు ఏ చర్య తీసుకోకపోవడం దారుణమన్నారు. మాజీ మంత్రి డొక్కా మాణిక్యవర ప్రసాద్ మాట్లాడుతూ 40 ఏళ్ల ప్రజాసమస్యలపై పోరాటం చేసిన నేత హత్యకుగురైతే పోలీసుల్లో చలనం లేకపోవడం సందేహాలకు తావిస్తోందన్నారు. బహుజన కెరటాలు సంపాదకులు పల్నాటి చెన్నకేశవులు మాట్లాడుతూ దళితులను హత్యగావించి ఏ వర్గాలకు మీరు కొమ్ముకాస్తున్నారో చెప్పాలని చంద్రం ముఠాను ప్రశ్నించారు. ఐఎఫ్‌టీయూ నేత పీ. ప్రసాద్ మాట్లాడుతూ విప్లవ ముసుగులో చంద్రం ముఠా సాగిస్తున్న హత్యాకాండను తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వల్లంరెడ్డి లక్ష్మణరెడ్డి, వీసీకే పార్టీ మహిళా విభాగం అధ్యక్షురాలు కైలా జయసుధ, విరసం నేత సీఎస్ఆర్ ప్రసాద్, చిలుకా చంద్రశేఖర్, వైకే, సాధు మాల్యాద్రి, పీ.కోటేశ్వరరావు, వివిధ దళిత, బహుజన, ప్రజా సంఘాలనేతలు పాల్గొని బ్రహ్మయ్య చిత్రపటానికి ఘనంగా నివాళులర్పించారు. బ్రహ్మయ్య హత్యను ఖండిస్తూ కళాకారులు ఆలపించిన గీతాలు సభా ప్రాంగణాన్ని ఉద్వేగభరితం చేశాయి.

చిరస్మరణీయుడు పాతూరి: ఎమ్మెల్యే శివకుమార్



నటరాజ పాతూరి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్ తదితరులు

తెనాలి, మారీసుపేట మార్చి 16: ఆంధ్ర నాటకరంగంలో తొలితరం నటులు నటరాజ పాతూరి రామకృష్ణమూర్తి చిరస్మరణీయుడని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. పట్టణంలోని తెనాలి బండ్‌పై శనివారం పౌరాణిక నాటక తొలితరం నటులు నటరాజ పాతూరి రామకృష్ణమూర్తి కాంస్య విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ పాల్గొని పాతూరి విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు నాటకరంగానికి పాతూరి చేసిన సేవలను కొనియాడారు. కార్యక్రమంలో పాతూరి జనార్ధనరావు, డాక్టర్ పాతూరి సుబ్రహ్మణ్య కవి, నటరాజ పాతూరి నాటక సమితి తెనాలి వ్యవస్థాపకులు ఎం.కృష్ణకిశోర్, గంపల నాగేశ్వరావు, పట్టణ రంగస్థల కళాకారుల సంఘ కార్యదర్శి గరికపాటి సుబ్బారావు, బి.నాగమణి తదితరులు పాల్గొన్నారు.

నేటి మహాకూటమి సభను జయప్రదం చేయండి

● పట్టణ, మండల అధ్యక్షుడు తాడిబోయిన, కేసన

తెనాలి, మారీసుపేట మార్చి 16: చిలకలూరిపేటలో ఆదివారం జరిగే టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో ఉమ్మడిగా నిర్వహిస్తున్న ప్రజాగళం సభను విజయవంతం చేయాలని టీడీపీ పట్టణ, మండలాధ్యక్షుడు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరావులు పిలుపునిచ్చారు. శనివారం స్థానిక కొత్తపేటలోని టీడీపీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో సభకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఆధ్వర్యంలో చిలకలూరిపేటలో ఆదివారం సాయంత్రం జరిగే సభకు తెలుగుదేశం పార్టీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, జనసేన అధినేత పవన్‌కళ్యాణ్, బీజేపీ నాయకులు, దేశ ప్రధాని నరేంద్ర మోదీ హాజరవుతున్నారన్నారు. సభా వేదికపై ఎన్నికల మేనిఫెస్టోను విడుదల చేయనున్నారని, వైసీపీ ఐదేళ్ళ పాలనలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని, ప్రజలు ఎదుర్కొన్న సమస్యలపై చర్చించి రాబోయే ఎన్నికలలో టీడీపీ, జనసేన, బీజేపీ అభ్యర్థుల గెలుపుతో రాష్ట్రంలో జరిగే అభివృద్ధి, ప్రజలకు అందించే సంక్షేమం వంటి పలు అంశాలపై మహాగళం సభలో నాయకులు ప్రసంగించనున్నారని తెలిపారు. రాష్ట్రాభివృద్ధి కాంక్షించే ప్రతి ఒక్కరూ ఈ సభకు హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో జొన్నాదుల మహేష్, కావూరి చంద్రమోహన్, చాట్రగడ్డ ఆంజనేయులు, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, కావేటి వేణు, విజయ్, గోపి, శివకేశవులు, రమేష్, యోహాను, శ్రీనివాసరావు, ఎం.విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న నాదెండ్ల మనోహరం తదితరులు

బాధితులకు మెరుగైన వైద్యసేవలందించండి

● నాదెండ్ల మనోహరం

తెనాలి రూరల్, మార్చి 16: తెనాలి ఆటోనగర్ సమీపంలో శుక్రవారం సాయంత్రం ఆర్టీసీ బస్సు ఆటో ఢీ కొన్న ఘటనలో తీవ్రంగా గాయపడిన బాధితులకు మెరుగైన వైద్యసేవలందించాలని తెనాలి టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. శనివారం పట్టణంలోని జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో వైద్యసేవలు పొందుతున్న ప్రమాద బాధితులను ఆమె పరామర్శించారు. ఈ సందర్భంగా మనోహరం మాట్లాడుతూ తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాల్లో బాధితులకు మెరుగైన చికిత్స అందించి త్వరితగతిన కోలుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోనే రెండో అతిపెద్ద ఆసుపత్రిగా ఉన్న తెనాలి వైద్యశాలకు కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ వంటి వైద్యులు అందుబాటులో లేకపోవడం బాధాకరమన్నారు. తక్షణమే వైదుల పోస్టులు భర్తీచేసి పేదలకు నాణ్యమైన వైద్యసేవలందించేలా చూడాలని ఆమె కోరారు. కార్యక్రమంలో పార్లమెంటరీ తెలుగు మహిళా అధ్యక్షురాలు అన్నాబత్తుని జయలక్ష్మి, టీడీపీ, జనసేన పార్టీల శ్రేణులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ముఖ్యమంత్రి ధ్యేయం

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

కొల్లిపర, మార్చి 16: అభివృద్ధి, సంక్షేమమే రాష్ట్ర ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి ధ్యేయమని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం మండల కేంద్రం కొల్లిపరలో రూ.3కోట్ల 19లక్షలతో సీసీ, బీటీ రోడ్డు నిర్మించడంతో స్థానిక నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ కొల్లిపర కరకట్ట నుంచి చివలూరు వరకు రోడ్డును నిర్మించడంతో ప్రజలకు ఎంతో ఉపయోగకరంగా ఉందన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర వైసీపీ కార్యదర్శి గుదిబండి చినవెంకటరెడ్డి, సర్పంచ్ బొంతు వేణుగోపాల్‌రెడ్డి, ఉపసర్పంచ్ అవుతు కృష్ణారెడ్డి, మాజీ జడ్పీటీసీ భట్టిప్రోలు వెంకటలక్ష్మి, ఎంపీటీసీలు కారుమంచి వృధ్వికుమార్, చిలుమూరు ఝాన్సీ, నాయకులు కల్లం వీరారెడ్డి, భీమవరపు సంజీవరెడ్డి, నెర్ల కుటుంబరెడ్డి, భీమవరపు శివకోటిరెడ్డి, గుడ్‌విల్ కృష్ణారెడ్డి, ఈదా యశ్వంత్‌రెడ్డి, గుదిబండి కృష్ణకిశోర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్, మార్చి 16: మండల గ్రామాల్లో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడమే లక్ష్యంగా పనిచేశామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శనివారం మండలంలోని నందివెలుగులో నూతనంగా నిర్మించిన డ్రెయిన్లు, సీసీ రోడ్లు, సచివాలయ భవనాన్ని ఎమ్మెల్యే శివకుమార్ ముఖ్య అతిథిగా హాజరై రిబ్బన్ కట్‌చేసి ప్రారంభించారు. పలువురు పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

తెనాలి, మారీసుపేట మార్చి 16: స్థానిక నాజరుపేటలోని మనఇల్లు వృద్ధాశ్రమంలో శనివారం శ్రీవెంకటేశ్వర యోగ సేవా కేంద్రం ఆధ్వర్యంలో యోగా సభ్యులు ముద్దాభక్తుని సామ్రాజ్యం పుట్టినరోజు సందర్భంగా ఆశ్రమంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ముద్దాభక్తుని రమణయ్య, ఆశ్రమ నిర్వాహకులు మురళి, అనూష పలువురు యోగ సాధకులు పాల్గొన్నారు.

విద్యుత్ విజిలెన్స్ అధికారుల తనిఖీలు

తెనాలి అర్బన్, మార్చి 16: గుంటూరు విద్యుత్ విజిలెన్స్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బృందం శనివారం చేబ్రోలు సెక్షన్ పరిధిలో విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. డివిజన్ ఆపరేషన్ ఈఈ చిరంజీవితో కలిసి 62బృందాలు ఏర్పాటుచేసి విస్తృతంగా విద్యుత్ తనిఖీలు చేశారు. 5289 సర్వీసులు తనిఖీచేయగా, అనుమతి లేని 138 సర్వీసులను గుర్తించారు. రూ.6.71 లక్షల జరిమానా విధించారు. విద్యుత్ చౌర్యం నేరమని, దీనికి పాల్పడేవారిని గుర్తించి ప్రజలు విద్యుత్ అధికారుల వాట్సాప్ నెంబర్లు 8331021047, 8331024029కు తెలియజేయాలని కోరారు.



ఆహారం పంపిణీ చేస్తున్న టీడీపీ నాయకులు

అన్న క్యాంటీన్‌లో ఆహారం పంపిణీ

తెనాలి, మారీసుపేట మార్చి 16: పట్టణంలో తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో పేద ప్రజల కోసం నిర్వహిస్తున్న అన్న క్యాంటీన్‌ల సేవలు కొనసాగుతున్నాయని, ఆహారం పంపిణీ చేశామని టీడీపీ నాయకులు సోమవరపు సాంబశివరావు అన్నారు. గుంటూరు పార్లమెంట్ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు డాక్టర్ పెమ్మసాని చంద్రశేఖర్ సౌజన్యంతో స్థానిక మార్కెట్ సెంటరులోని అన్న క్యాంటీన్‌లో, శివాజిచౌక్‌లోని అన్న క్యాంటీన్‌లలో శనివారం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గోగినేని రమేష్, క్రొత్తపల్లి రమేష్, ముళ్ళపూడి వెంకట్, మాదల కోటేశ్వరావు, వెల్లంకి సాంబయ్య, అక్కిశెట్టి వెంకటేశ్వరావు, కామేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

అమరజీవికి ఘన నివాళి

తెనాలి, మారీసుపేట మార్చి 16: పట్టణ పరిసర గ్రామాలలో అమరజీవి పొట్టి శ్రీరాములు 123వ జయంతిని ఘనంగా నిర్వహించారు. మారీసుపేటలోని పొట్టి శ్రీరాములు కాంస్య విగ్రహం వద్ద గుంటూరు జిల్లా ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు పెండాల సుబ్బారావు, తెనాలి పట్టణ ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు గోనుగుంట్ల శ్రీనివాసరావు, వైశ్య విద్యానిధి కార్యదర్శి పెండాల వెంకట్రావులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగువారి ఒక రాష్ట్రం ఉండాలని ప్రత్యేక ఆంధ్రప్రదేశ్ కోసం పాణత్యాగం చేసిన మహనీయుడని కొనియాడారు. కార్యక్రమంలో వాసవీ సేవా సమితి అధ్యకుడు వరదా వెంకట శేషగిరిరావు, సంఘ నాయకులు తాతా శ్రీనివాసరావు, తాళ్ళూరి సూర్యనారాయణ, యక్కల శ్రీమన్నారాయణ, పెండాల చంద్రశేఖర్, చుండూరి మల్లికార్జునరావు, వెల్లంపల్లి సత్యనారాయణమూర్తి, ముప్పల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండల పరిధిలోని కొలకలూరు శాఖా గ్రంథాలయంలో పొట్టి శ్రీరాములు జయంతిని శ్రీవర్ధనీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు ఘనంగా నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి గ్రంథాలయాధికారి కడియాల సుజాత పూలమాలలువేసి నివాళి అర్పించారు. తదనంతరం విద్యార్థులకు పొట్టి శ్రీరాములు జీవిత చరిత్రపై వకృత్వ పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆంధ్ర రాష్ట్రంకోసం 56 రోజులు ఆమరణ నిరాహారదీక్ష చేసి అమరులయ్యారని అన్నారు. అయన త్యాగాలను భావితరాలకు ఆదర్శమన్నారు. అనంతరం పోటీలలో విజేతలైన సింధుప్రియ, మనోజ్ఞ, నూతన్‌లకు బహుమతులను ప్రదానం చేశారు. కార్యక్రమంలో శ్రీవర్ధినీ స్కూల్ ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



పొట్టి శ్రీరాములు జయంతి సభలో మాట్లాడుతున్న నరేంద్ర కుమార్



అమరజీవి శ్రీరాములుకు నివాళులర్పిస్తున్న మున్సిపల్ మాజీ చైర్మన్ వెంకట్రావు తదితరులు

అమరజీవి త్యాగం మరువలేనిది: ధూళిపాళ్ళ

పొన్నూరు టౌన్, మార్చి 16: తెలుగు ప్రజల కోసం ప్రత్యేక రాష్ట్రం సాధించాలని ప్రాణత్యాగం చేసిన అమరజీవి పొట్టి శ్రీరాములు మహనీయుడు అన్ని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పట్టణంలోని ఐల్యాండ్ సెంటర్‌లో శనివారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పొట్టి శ్రీరాములు జయంతి వేడుకలు జరిగాయి. ఈ సందర్భంగా పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి ఘననివాళులు అర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో నరేంద్రకుమార్ మాట్లాడుతూ పొట్టి శ్రీరాములు తెలుగుజాతి కోసం ప్రాణాలను తృణప్రాయంగా వదులుకున్నారన్నారు. అలాంటి మహనీయుడిని తెలుగుజాతి ఉన్నంత వరకు తెలుగునేల మరువదన్నారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు కోట రవిచంద్ర, కోట సురేష్, తాడికొండ సుధీర్, హేమచంద్ర గుప్త, బాపనపల్లి ప్రభాకరరావు, యామా రాము, ఉసరిక రాము, ఎ.వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



జనసేన పార్టీ కార్యాలయంలో అమరజీవి పొట్టిశ్రీరాములు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న డాక్టర్ మనోహరం, తదితరులు



కొల్లిపరలో పొట్టి శ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఆర్యవైశ్య సంఘ నాయకులు

కొల్లిపర మండలంలో...

కొల్లిపర, మార్చి 16: మండల కేంద్రం కొల్లిపర ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని శనివారం ఘనంగా నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ నాయకులు పొట్టి శ్రీరాములు విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా ఆర్యవైశ్య సంఘ ఉపాధ్యక్షుడు అన్నవరపు రమేష్ మాట్లాడుతూ ఆంధ్రరాష్ట్రం కోసం పొట్టి శ్రీరాములు చేసిన త్యాగం మరిచిపోలేనిదన్నారు. కార్యక్రమంలో మండల ఆర్యవైశ్య సంఘ అధ్యక్షుడు మునగాల రామలక్ష్మణరావు, ఆర్యవైశ్య సంఘం మండల కార్యదర్శి తాతా సతీష్, ఆర్యవైశ్య నాయకులు చుండూరు వెంకటరత్నం, సుగ్గుల క్రాంతికుమార్, దాసరి అంబయ్య, తూములూరు రామన్న, సుగ్గుల సురేష్‌కుమార్, మునగాల నవీన్, ఉమా తదితరులు పాల్గొన్నారు.

● తెనాలి రూరల్: అమరజీవి పొట్టి శ్రీరాములు ప్రాణత్యాగం వల్లనే ప్రత్యేక ఉమ్మడి రాష్ట్రం సాధ్యమైందని ఆయనను స్మరించుకోవడం మనందరి బాధ్యత అని తెనాలి టీడీపీ, జనసేన, బీజేపీ పార్టీల ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి నాదెండ్ల మనోహర్ సతీమణి డాక్టర్ మనోహరం అన్నారు. శనివారం అమజీవి పొట్టి శ్రీరాముల జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో పొట్టి శ్రీరాములు చిత్రపటానికి పార్టీ శ్రేణులతో కలిసి ఆమె పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. అనంతరం రైల్వే స్టేషన్ రోడ్డులోని అమరజీవి పొట్టిశ్రీరాములు విగ్రహానికి ఆమె పూలమాలలతో నివాళులర్పించారు. పలువురు పార్టీ శ్రేణులు, అమరజీవి అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు ప్రజల గుండెల్లో చిరస్మరణీయుడు అమరజీవి

● ఎమ్మెల్యే శివకుమార్

తెనాలి రూరల్, మార్చి 16: తెలుగువారి కోసం ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించేందుకు ప్రాణత్యాగానికి సైతం వెనుకాడని మహనీయుడు అమరజీవి పొట్టి శ్రీరాములని, తెలుగువారి గుండెల్లో ఆయన చిరస్మరణీయులని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ చెప్పారు. శనివారం అమరజీవి పొట్టి శ్రీరాములు జయంతిని పురస్కరించుకుని పట్టణంలోని బోస్‌రోడ్డులోగల ఆయన విగ్రహానికి ఎమ్మెల్యే శివకుమార్ పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మునిసిపల్ ఛైర్‌పర్సన్ తాడిబోయిన రాధిక, పలువురు కౌన్సిలర్లు, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.



బోస్ రోడ్డులోని పొట్టిశ్రీరాములు విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే శివకుమార్, తదిరులు

భక్తిశ్రద్ధలతో ఆరెమండ్లమ్మ తిరునాళ్ల



ఆరెమండ్లమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తున్న నరేంద్ర కుమార్

పొన్నూరు టౌన్, మార్చి 16: మండల పరిధిలోని ఆరెమండ గ్రామంలోని ఆరెమండ్లమ్మ అమ్మవారి తిరునాళ్ల శనివారం భక్తిశ్రద్ధలతో జరిగింది. అమ్మవారి తిరునాళ్ల మహోత్సవాన్ని పురస్కరించుకొని ఉదయం జలాభిషేకాలు నిర్వహించారు. మహిళలు పొంగళ్లను నైవేద్యంగా సమర్పించారు. సాయంత్రం గ్రామంలో ప్రభల ఉత్సవం వైభవోపేతంగా జరిగింది అమ్మవారి తిరునాళ్లను పురస్కరించుకొని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ ఛైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



డాక్టర్ శారదను సత్కరిస్తున్న రాజకుమారి, దిలీప్‌రాజా, ఖలేదానసీమ్ తదితరులు

డాక్టర్ శారదకు సంఘ సంస్కర్త షారోన్ అవార్డు

తెనాలి అర్బన్, మార్చి 16: పట్టణంలో ప్రజలకు విశిష్ట రీతిలో వైద్యసేవలు అందిస్తున్న డాక్టర్ శారదకు కెనడా సంఘ సంస్కర్త షారోన్ అంతర్జాతీయ సేవా అవార్డును శనివారం ప్రదానం చేశారు. సుల్తానాబాద్‌లోని కల్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో పెన్నీ మినిస్ట్రీస్ సంస్థ ఆధ్వర్యంలో సినీ దర్శకుడు దిలీప్‌రాజా అధ్యక్షతన మహిళా కమిషన్ మాజీ ఛైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి మాట్లాడుతూ, కరోనా సమయంలో ప్రాణాలకు తెగించి ప్రతి ఇంటికి వెళ్లి వైద్యసేవలు అందించిన ఘనత వైద్యురాలిగా ఆమె ఒక్కరికే దక్కుతుందన్నారు. రోగులకు సేవ చేసి, రూ.లక్షలు వెచ్చించి పరికరాలు పంపిణీ చేశారని అభినందించారు. అంతేకాకుండా ప్రతినెలా మధుమేహ రోగులకు ఉచిత వైద్య శిబిరాలు, పరీక్షలు, మందులు, అల్పాహారం కూడా అందించడం సేవాతత్పరతకు నిదర్శనమన్నారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉప అధికారి అన్నపూర్ణ, మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ సయ్యద్ ఖలేదా నసీమ్‌లు శారద మానవత్వానికి ప్రశంసించారు. కార్యక్రమంలో డాక్టర్ ప్రేమ్‌చంద్, డాక్టర్ రాకేష్, డాక్టర్ శరత్‌బాబు, డాక్టర్ చలం, ప్రేమ్‌కుమార్, ప్రదీప్ పాల్గొన్నారు. అనంతరం ఆమె వద్ద వైద్యసేవలు పొందిన 100మంది ఆమెను ఘనంగా సత్కరించారు.



లోక్ అదాలత్‌లో పాల్గొన్న న్యాయాధికారి జె.శ్రీసీత

జాతీయ లోక్ అదాలత్‌లో 205కేసులు పరిష్కారం

తెనాలి క్రైం, మార్చి 16: మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించారు. మొత్తం 3బెంచ్‌ల ద్వారా 205కేసులు పరిష్కారమయ్యాయి. మొదటి బెంచ్‌కు న్యాయాధికారి వీ.ఎ.ఎల్.సత్యవతి, 2వ బెంచ్‌కి సీనియర్ సివిల్ జడ్జి షేక్ అబ్దుల్ షరీఫ్, 3వ బెంచ్‌కు అదనపు జూనియర్ సివిల్ జడ్జి జె.శ్రీసీత బాధ్యతలు నిర్వహించారు. అందులో 16 సివిల్ కేసులు, 167 క్రిమినల్ కేసులు, 22 ప్రీ లిటిగేషన్ కేసులు పరిష్కారమయ్యాయి. ప్రిన్సిపాల్ సీనియర్ సివిల్ జడ్జి ఎం.శ్రీధర్, లోక్ అదాలత్ మెంబర్లు సోలా శంకర్, జి.వెంకయ్య, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు మండలపు వేణుగోపాలరావు, సీనియర్, జూనియర్ న్యాయవాదులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

వెస్ట్‌బెర్రి స్కూల్‌లో ప్రీకేజీ విద్యార్థుల స్నాతకోత్సవం

తెనాలి అర్బన్, మార్చి 16: బుర్రిపాలెం రోడ్డులోని వెస్ట్‌బెర్రి స్కూల్‌లో శనివారం ప్రీకేజి విద్యార్థుల స్నాతకోత్సవం నిర్వహించారు. ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చిన్నారులకు పట్టాలు అందజేశారు. విద్యార్థులు పలు సాంస్కృతిక ప్రదర్శనలు చేశారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న మాజీ ఎమ్మెల్యే ఉమ

మాజీ కౌన్సిలర్ ఫాతిమా వర్ధంతి

తెనాలి అర్బన్, మార్చి 16: మారీసుపేటలో 22వ వార్డు కౌన్సిలర్ షేక్ ఫాతిమా వర్ధంతి శనివారం నిర్వహించారు. ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మాజీ ఎమ్మెల్యే డాక్టర్ గోగినేని ఉమ చేతుల మీదుగా 100 పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ చేశారు. షేక్ సుభాని, రిహానా, నదియ, కన్నెగంటి మురళి, ఈదర పూర్ణచంద్, పావులూరి రాంబాబు, చల్లా పుల్లారావు, కావూరి చంద్రమోహన్, రావి చిన్ని తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నాబత్తుని పేరు ఖరారు

తెనాలి రూరల్, మార్చి 16: తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నాబత్తుని శివకుమార్ పేరు ఖరారు చేసింది. శనివారం విడుదల చేసిన జాబితాలో తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా అన్నాబత్తుని శివకుమార్ నియామితులయ్యారు. ప్రస్తుతం తెనాలి ఎమ్మెల్యేగా ఆయన కొనసాగుతున్నారు. గత కొంత కాలంగా తెనాలి వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థిపై పలువురి పేర్లు ప్రచారం జరిగాయి. ఎట్టకేలకు శివకుమార్‌కు స్థానం దక్కడంతో పార్టీ శ్రేణుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. పలువురు పార్టీ శ్రేణులు ఎమ్మెల్యే శివకుమార్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

వెల్లలూరు అభివృద్ధిపై వైసీపీ అసత్య ప్రచారాలు

పొన్నూరు టౌన్, మార్చి 16: వెల్లలూరులో జరిగిన అభివృద్ధిపై వైసీపీ అసత్య ప్రచారాలు చేస్తుందని వెల్లలూరు టీడీపీ అధ్యక్షుడు సూద రామకృష్ణ, గూడపాటి కాశేశ్వరరావులు అన్నారు. శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో టీడీపీ నాయకులు మాట్లాడుతూ 2014నుంచి 2019 వరకు ధూళిపాళ్ళ నరేంద్రకుమార్ హయాంలో 2.3 కిలో మీటర్లు మీర రహదారులు నిర్మాణం చేపట్టినట్లు చెప్పారు. 600మీటర్ల మేర పంట కాల్వలు సిమెంట్ కాల్వగా నిర్మించిన్నట్లు చెప్పారు. 70 మందికి కాపు కార్పొరేషన్ ద్వారా సబ్సిడీ రుణాలు అందించారన్నారు. విదేశీ విద్య పథకాన్ని కాపులకు అమలు చేశారన్నారు. కానీ గత ఐదేళ్ల వైసీపీ పాలనలో వెల్లలూరు గ్రామానికి జరిగిన అభివృద్ధి ఏముందని ప్రశ్నించారు. జిల్లా పరిషత్ హైస్కూల్‌కు చెందిన విద్యార్థుల ఆట స్థలంలో బీసీఎంఎస్ గోడౌన్ నిర్మించి విద్యార్థులకు ఆటస్థలమే లేకుండా చేశారని ఆరోపించారు. గ్రామంలో అభివృద్ధి చేయలేక పోగా నరేంద్రకుమార్‌ను విమర్శిస్తే సహించబోమన్నారు. రానున్న ఎన్నికలో టీడీపీ, జనసేన, బీజేపీ కూటమికి వెల్లలూరు ప్రజలు అండగా ఉంటారని తేల్చిచెప్పారు. వైసీపీ నాయకులు ఇప్పటికైనా అసత్య ప్రచారాలు మాని వెల్లలూరు ప్రజల సంక్షేమం కోసం ఆలోచించాలని హితవు పలికారు.



కొల్లిపరలో శ్రీజనార్థనస్వామిని ఊరేగింపు నిర్వహిస్తున్న భక్తులు

జనార్ధనస్వామి బ్రహ్మోత్సవాలు ప్రారంభం

కొల్లిపర, మార్చి 16: మండల కేంద్రం కొల్లిపర శ్రీదేవి భూదేవి సమేత జనార్ధన స్వామి ఆలయంలో వార్షిక బ్రహ్మోత్సవాలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. బ్రహ్మోత్సవాలు సందర్భంగా స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి పండితులు పూజలు నిర్వహిస్తున్నారు. పండితులు జగన్నాధాచార్యులు, పోగుల రామలింగేశ్వరశర్మ, యోగానంద పృధ్విభార్గవ్, వీరభద్రేశ్వరశర్మ, ప్రసాదశర్మ, సీతారామాచార్యులు స్వామివారికి వివిధ అభిషేకాలు నిర్వహించారు. స్వామివారికి విష్వక్సేన, పుణ్యాహవచన వంటి పూజలు చేసిన అనంతరం స్వామివారిని పెండ్లి కుమారుడిని చేసి ప్రత్యేకంగా అలంకరించిన ట్రాక్టర్‌పై ఉంచి గ్రామ పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులకు మంత్రపుష్పంతో పాటు తీర్థప్రసాదాలను అందజేశారు.

చట్టాలపై సరైన అవగాహన ఉండాలి

● తెలంగాణ హైకోర్టు న్యాయవాది అసద్ హుస్సేన్

గుంటూరు (విద్య), మార్చి 16: విద్యార్థులు కార్పొరేట్ లా ప్రాక్టీస్ చేయాలంటే కాంట్రాక్టుల చట్టంపై సరైన అవగాహన ఉండాలని తెలం గాణలోని హైకోర్టు అడ్వకేట్ అసద్ హుస్సేన్ అన్నారు. చేబ్రోలు మండలం వడ్లమూడి విజ్ఞాన్స్ యూనివర్సిటీలోని లా డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో 'కార్పొరేట్ లీగల్ ప్రాక్టీస్ అండ్ జనరల్ లిటిగేషన్' అనే అంశంపై ప్రత్యేక అతిథి ఉపన్యాస కార్యక్రమాన్ని నిర్వహించారు. అసద్ హుస్సేన్ మాట్లాడుతూ న్యాయవాద వృత్తిలోకి ప్రవేశించిన తర్వాత విద్యార్థులు ఎదుర్కోవాల్సిన సవాళ్ల గురించి తెలియజేశారు. ప్రజల కోసం న్యాయపోరాటం చేయాలనుకుంటే ముందుగా చట్టంలోని మౌలికాంశాలను అర్థం చేసుకోవాలని విద్యార్థులకు సూచించారు. సివిల్ ప్రొసీజర్ కోడ్, క్రిమినల్ ప్రొసీజర్, కార్పొరేట్ చట్టాల పరస్పర సంబంధం గురించి వివరించి న్యాయ అభ్యాసానికి పునాదిగా ఉద్బోధించారు. కంపెనీల ప్రాథమిక నిర్మాణం, చట్టపరమైన బాధ్యతలతో పాటు వాటి పనిగురించి వివరించారు. కార్యక్రమంలో విజ్ఞాన్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్‌లా సిబ్బంది పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో 2035 కేసుల పరిష్కారం

గుంటూరు(లీగల్), మార్చి 16: జిల్లాలోని వివిధ కోర్టుల్లో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో మొత్తం 2035 కేసులను రాజీమార్గం లో పరిష్కరించినట్లు జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి టి లీలావతి తెలిపారు. 364 సివిల్ కేసులు; 1421 క్రిమినల్ కేసులు, 250 ప్రీలిటిగేషన్ కేసులు ఈ లోక్ అదాలత్‌లో పరిష్కారమయ్యాయని తెలిపారు. శనివారం ఉదయం జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్ ప్రారంభ కార్యక్రమంలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఛైర్మన్ వైవీఎస్‌బీజీ పార్థసారధి మాట్లాడుతూ కక్షిదారులు లోక్‌అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలన్నారు. సమావేశంలో న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి లీలావతి, పలువురు న్యాయ వాదులు, కక్షిదారులు పాల్గొన్నారు.